సూర్య
www.suryaa.com
ఆదివారం
26.1.2025




## మడమ తిప్పని మహానాయకుడు

# భారతరత్న కర్పూరి ఠాగూర్

## చైర్మన్‌తో ముఖాముఖి



**నూకారపు సూర్యప్రకాశరావు**
చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య

రోజుకు ఎనిమిది గంటలు.. వారానికి ఆరు రోజుల పని భారత దేశంలో ప్రామాణిక సమయం. ఓ మనిషి శారీరకంగా, మానసికంగా పని చేయడానికి.. తర్వాత కుటుంబానికి , విశ్రాంతికి సమయం కేటాయించడానికి ఇంత కన్నా ఎక్కువ పని చేయడం శ్రేయస్కరం కాదని నిర్ధారించారు. ప్రపంచంలో చాలా దేశాలు.. రోజుకు తొమ్మిది గంటలు వారానికి ఐదు రోజులు పని పద్ధతిని పాటిస్తున్నాయి. టెక్ ప్రపంచం విస్తరించిన తర్వాత భారత్ లోనూ ఆ విధానం పెరుగుతోంది. ఇప్పటికే పని గంటలతో పని లేకుండా పని చేయించుకుంటున్నారని.. చాలా కంపెనీలపై ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు కార్పొరేట్ బాసులు.. అసలు కుటుంబాలు ఎందుకు పని చేస్తేచాలు కదా అంటున్నారు. కాస్త వివరించండి

– కె. లలిత, కాకినాడ

ఇన్ఫోసిస్ ఫౌండర్ నారాయణమూర్తి కొన్నాళ్ల కిందట యువత వారానికి 70 గంటలు పని చేయాలని సలహాిచ్చారు. అంటే విశ్రాంతి తీసుకోకుండా వారానికి ఏడు రోజులు రోజుకు పది గంటలు పని చేయాలి. ఒక రోజు సెలవు తీసుకోవాలనుకుంటే.. ఆరు రోజుల పాటు రోజుకు పదకొండున్నర గంటలు పని చేయాలని చేయాలని చెప్పుకొచ్చారు. నారాయణమూర్తికి వయసు పెరిగిపోయిందని చాదస్తంగా మాట్లాడుతున్నారని చాలా మంది లైట్ తీసుకున్నారు. అయితే ఆయన మాత్రం తన విధానాన్ని మార్చుకునేది లేదన్నారు. తాజాగా నారాయణమూర్తి కంటే ఎక్కువగా వారానికి 90 గంటలు పని చేయాలని.. ఇంట్లో బార్యముఖాలు ఎంత సేపు చూస్తారని ఎల్ అండ్ టీ చైర్మన్ వాక్రూచ్చారు. ఆయన మాటల్ని ఎల్ అండ్ టీకూడా సమర్థించుకుంది. కొంత మంది వీరి మాటలకు మద్దతుగా మాట్లాడుతున్నారు. కానీ చాలా మంది వ్యతిరేకిస్తున్నారు. రోజుకు ఇరవై నాలు గంటలు అంటే.. ఏడు రోజులకు 168 గంటలు. ఇందులో 90 గంటల పాటు పని చేస్తే ఇక మిగిలేది 78 గంటలు. ఓ మనిషికి కనీసం ఆరేడు గంటల నిద్ర చాలా అవసరమని వైద్యులు ప్రకటించారు. లేకపోతే ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. అంటే కనీసం యభై గంటలు నిద్రకు తీసేయాలి. ఇక మిగిలే 28 గంటల్లో కాలకృత్యాలు తీర్చుకోవడానికి, తినడానికి స్నానం చేయడానికి.. రోజుకు కనీసం గంట పాటు కేటాయించుకున్నా.. ఇక మిగిలేది ఇరవై గంటలు. ఇందులోనే వ్యక్తిగత పనులు.. కుటుంబ అవసరాలు.. అన్నీ చూసుకోవాలి. అంటే రోజుకు మూడు గంటలు మాత్రమే ఉంటుంది. కాస్త రిలాక్స్ అయ్యేందుకు ఒక్క సినిమా చూసేందుకు కూడా టైమ్ ఉండదన్నమాట. ఉదయం ఆరు గంటలకు లాగిన్ అయితే..రాత్రి ఏడు గంటల వరకూ పని చేయాలని చెబుతున్నారు. అది కూడా ఏడు రోజులు. ఇంత కన్నా బానిసత్వం ఏమీ ఉండదని ఎవరైనా అనిపిస్తుంది. ఇప్పటికే దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా యువతలో మానసికపరమైన సమస్యలు పెరుగుతున్నాయి. అంత కంటే మించి కెరీర్ తో పాటు కుటుంబానికి.. జీవితాన్ని ఆస్వాదించడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. సొంత కంపెనీలు పెట్టుకున్నా సరే పర్సనల్ లైఫ్ కు ప్రాధాన్యం ఇస్తున్నారు. అదే సమయంలో టెక్ కంపెనీల్లో పెరుగుతున్న ఒత్తిడి కారణం.. ఉద్యోగుల ఔట్ పుట్ తగ్గిపోతోందని.. వారికి తగినంత విశ్రాంతి ఇవ్వాలన్న రిపోర్టులు వెలుగులోకి వస్తున్నాయి. ఇలా దేశ యు వతను వారానికి 90 గంటలు పని చేయించుకుంటే.. ఇండియా ఉత్పాదకత పెరగ దని..మ్యాన్ పవర్ మొత్తం నిర్వీర్యం అయిపోతుందని అంటున్నారు. నారాయణమూర్తి ప్రారం భించిన డిబేట్ ను సుబ్రహ్మణ్యన్ పీక్ కు తీసుకెళ్లారు. ఇపుడు డిబేట్ విపరీతంగా జరుగు తుంది. చివరికి ఏమైనా మార్పులు జరుగుతాయా లేదా అన్ని వేచి చూడాల్సి ఉంది.

ఉదయం పది దాటుతున్న ఢిల్లీలో సూర్యుడి జాడే కనిపించడం లేదు. వెలుతురుగా ఉన్నా ఎదుట మనిషి కనిపించడం లేదు. దీనికి కారణం విపరీతమైన పొగమంచు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నీరు. మీరేమంటారు.

– అంపిలి విజయకుమార్, హైదరాబాద్

ఢిల్లీలో ప్రతి సంవత్సరం శీతాకాలం వచ్చిందంటే చాలు చలిగా విపరీతంగా ఉంటుంది. ఈ ఏడాది కూడ ఇక్కడ ఉష్ణోగ్రతలు చాలా తక్కువగా నమోదవుతున్నట్లు అధికారులు తెలిపారు. సూర్యుడు రానా వద్దా అంటూ అలా కనిపిస్తున్నాడు. అయినప్పటికీ రోజంతా బాగా చలిగానే ఉంటోంది. దానికి తోడు ఉదయాల్లో పొగమంచు వల్ల ఎదురుగా ఏమి ఉంటుందో కనిపించడం లేదు. ఢిల్లీలో దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో అధికారులు ఈరోజు 12 విమానాలను రద్దు చేశారు. మరో 100 ఫ్లైట్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. 123 విమానాలు సగటున అరగంట పాటు ఆలస్యంగా నడుస్తున్నాయి. పొగమంచు కారణంగా శుక్రవారం ఒక్కరోజే సుమారు 6 విమానాలు రద్దు అయ్యాయి. 100 ఫ్లైట్స్ ఆలస్యంగా నడిచాయి. ఉదయం ఎనిమిది గంటలకు ఢిల్లీలో జీరో విజిబిలిటీ ఉండడమే దీనికి కారణం అని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే నిన్నటి కంటే ఈరోజు పరిస్థితి కాస్త మెరుగ్గా ఉంది. విజిబిలిటీ కాస్త బెటర్గా ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీనికి తోడు ఢిల్లీలో ఎయిర్ పొల్యూషన్ కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. మరో పక్క రైళ్ళు కూడా ఆలస్యంగా నడుస్తున్నాయి. మంచు కారణంగా ఢిల్లీ వెళ్లే దాదాపు 50 కి పైగా రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. అలాగే ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, కర్నాల్ గాజియాబాద్ ప్రాంతాల్లో ఎదురుగా ఉన్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి కంటిన్యూ అవుతోంది.
దీంతో చాలాచోట్ల ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఇప్పటికే వాతావరణ శాఖ ఢిల్లీకి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. జనవరి 8 వ తేదీ వరకు దేశ రాజధానిలో పొగ మంచు ఇలానే ఉండే అవకాశాలున్నట్లు వాతావరణశాఖ అంచనా వేస్తోంది.

## లెజెండ్

# సాహసికుడు బినిత్య స్వాప్నికుడు నేతాజీ



నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారత దేశ స్వాతంత్ర సమరంలో పాల్గొని బ్రిటిష్ పాలకుల దుర్నీతినిధైర్యంగా ఎదుర్కొని నాటి వలస పాలకులకు సింహస్వప్నంగా మారారు. భారతదేశం విముక్తి కోసం జాతీయ సైన్యం స్థాపించి "జైహింద్ "అనే నినాదంతో స్వాతంత్ర సమరాన్ని ఉధృతస్థాయితో నిర్వహించిన నేతాజీ గొప్ప జాతీయ నాయకులు. స్వతంత్ర సమరయోధులు. స్వాతంత్ర సమర చరిత్రలో నేతాజీ నిర్వహించిన పాత్ర యువతకు స్ఫూర్తిదాయకం సాయుధ పోరాటాన్ని సాధనంగా ఎంచుకున్న గొప్ప దేశభక్తుడు. 1897 సం"లో జనవరి 23వ తేదీన కటక్లోజన్మించారు. సుభాష్ చంద్రబోస్ తండ్రి జానకి నాథ్ బోస్ కటక్ మున్సిపాలిటీకి చైర్మన్గా' ప్రభుత్వం న్యాయవాదిగా పని చేసి 1912 సం "లో బెంగాల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ కు సభ్యులుగా నియమించబడి "రాయ బహుదూర్ "బిరుదును పొందారు. బ్రిటిష్ వారి ధమన నీతికి 'దౌర్జన్యాలకు' దోపిడీలకు వ్యతిరేకంగా రాయబహదూర్ త్యజించారు.పదవులకు రాజీనామా చేశారు .మహాత్మా గాంధీ స్వాతంత్ర పోరాటానికి ఆకర్షితుడై దేశవిముక్తిలో కీలకపాత్రను పోషించారు. తండ్రిగారి దేశభక్తి కి నేతాజీ ప్రభావితుడైనాడు. సంపూర్ణ స్వాతంత్రమే తన ఆరోజు విధానానికి మార్గంగా ఎంచుకొని యువతకు మార్గదర్శిగా నిలిచారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తించబడ్డారు. చదువులలో అగ్రగణ్యుడిగా అధ్యాపకులు చేత మెప్పు పొందారు.
మెట్రిక్యులేషన్ ' బి'ఏ ఆనర్స్ పరీక్షలో.యూనివర్సిటీ స్థాయిలో రెండవ రాంకు సాధించారు. ఐ' సి' ఎస్ పరీక్షలో ఉత్తమ మార్కులతో పాసైన నలుగురిలో ఒకడిగా నిలిచిన బహుముఖ ప్రజ్ఞావంతుడునేతాజీ. నేతాజీ మహాత్మా గాంధీని బొంబాయిలో కలిశాడు. స్వాతంత్రానికి అవసరం వ్యూహాలపై దీర్ఘంగా చర్చించారు.
కాంగ్రెస్ చేపట్టిన విదేశీ వస్తు బహిష్కరణోద్యమం. బ్రిటిష్ పాలకులను ప్రభావితం చేయలేదు. బ్రిటిష్ ప్రభుత్వం "వేల్స్" రాకుమారన్ని మన దేశ సందర్శనకు పంపింది. రాకుమారుని రాకను నిరసిస్తూ కలకత్తాలో జరిగిన ఉద్యమానికి నేతాజీ నాయకత్వం వహించి విజయవంతం చేశాడు. వేల్స్ రాకుమారుని సందర్శనను భారతజాతి బహిష్కరించాలని నేతాజీ పిలుపునిచ్చారు. రాకుమారుని రాకను నిరసిస్తూఉద్యమాన్నినిర్వహించి సుభాష్ చంద్రబోస్ అరెస్టయ్యాడు.
1941 సం"లో మారువేషంలో సుభా ష్ చంద్రబోస్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు . నేతాజీని అనేకమార్లు ప్రభుత్వం జైల్లో నిర్బంధించింది. తన ఉపన్యాసాలతో అగ్ని కణాలు వర్షిస్తూ శుష్క వాగ్దానాలు రిక్తహస్థాలతో స్వాతంత్రం రాదని ఎలుగెత్తి చాటిన ప్రజానేత నేతాజీ.

1922 సంలో సుభాష్ చంద్రబోస్ "బంగ్లార్ కథ" అనే పత్రికకు ఎడిటర్ గా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీకి కార్యదర్శిగా గురుతర బాధ్యతలు నిర్వహించారు. 1924లో "స్వరాజ్య పార్టీ" కలకత్తా స్థానిక ఎలక్షన్లో విజయం సాధించింది. తన 27వ'ఏటా మున్సిపల్ కమిషనర్ గా ఎన్నికయ్యారు. కమిషనర్ హొదాలో సుభాష్ చంద్రబోస్ చేపట్టిన సామాజిక కార్యక్రమాలు ప్రభుత్వానికి నచ్చలేదు .ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నాడనే అభియోగంతో అరెస్టు చేసి బెంగాల్ జైల్లో పెట్టింది. కొంతకాలం తర్వాత "మాండలే జైలు"కు పంపింది. 2సం"రాల పైగా జైలు జీవితాన్ని అనుభవించారు. అదే సమయంలో దేశ బంధు చిత్తరంజన్ దాస్ మరణించాడు. మోతీలాల్ నెహ్రూ విదేశాలకు వెళ్లారు. మహాత్మా గాంధీ రాజకీయ రంగం నుండి విరమించు కున్నారు. స్వాతంత్ర సమరభారం యువ నాయకుల భుజస్కందాలపై పడింది .యువ నాయకులలో నేతాజీ' జవహర్లాల్ నెహ్రూలు ప్రధానమైన వ్యక్తులు. స్వరాజ్య పార్టీ శాసనసభలో ప్రవేశించి ప్రభుత్వాన్ని స్తంభింప చేసింది. ప్రభుత్వం శాసనసవరణ కమిటీని "సైమన్ "అధ్యక్షత ఏర్పాటైన కమిటీలో భారతీయులకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం వలన ప్రజలు సైమన్ కమిషన్ వ్యతిరేకంగా ఉద్యమించారు. బెంగాల్లో సుభాష్ చంద్రబోస్ సారధ్యంలో "సైమన్ కమిషన్" కు వ్యతిరేకంగా నిరసన జరిగింది. ఈ సమయంలో అఖిల బెంగాల్ యువజన సంఘాన్ని పునరుద్ధరించి యువతరం శాసనోల్లంఘనానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు రాజకీయాల్లో పాల్గొనాలని ప్రోత్సహించారు.

1927లో మద్రాసులో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో అఖిలభారత కాంగ్రెస్ కమిటీకి కార్యదర్శిగా ఎన్నికైనారు. జవహర్లాల్ నెహ్రూ' శ్రీనివాస అయ్యంగారితో కలిసి "ఇండియన్ ఇండిపెండెన్స్ లీగను" స్థాపించాడు. 1928బి 1938 సంవత్సరాల మధ్య 10 సం"రాలు విదేశాల్లో పర్యటించి భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమ ఆవశ్యకతను విశేషంగా ప్రచారం చేశారు.

1938 వ సంవత్సరంలో సుభాష్ చంద్రబోస్ 41వఏట కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైనారు. కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహిస్తూ జవహర్ లాల్ నెహ్రూ అధ్యక్షతన "జాతీయ ప్రణాళిక సంఘం" ఆవిర్భావానికి తోడ్పడినారు. తర్వాత సం"లో జరిగిన ఎన్నికల్లో మహాత్మా గాంధీ అభ్యర్థిగా డాక్టర్ 'పట్టాభి తో పోటీపడి సుభాష్ ఎన్నికల్లో గెలిచాడు. పట్టాభి ఓటమి తన ఓటమి అని మహాత్మా గాంధీ ప్రకటించారు. మహాత్మా గాంధీ అనుచరులతో ఏర్పడిన విభేదాల కారణంగా సుభాష్ చంద్రబోస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు .1939లో కాంగ్రెస్ లోనే "ఫార్వర్డ్ బ్లాక్" అనే సంస్థను ఏర్పాటు చేశారు .రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్ వారికి ఫార్వర్డ్ బ్లాక్ సహాయం చేయకూడదని ప్రచారం చేసినందుకు అరెస్ట్ చేసి జైలుకు వెళ్లాడు .జైల్లో ఉన్నప్పుడు నేతాజీ నిరాహార దీక్ష చేస్తానని ప్రభుత్వాన్ని హెచ్చరించిన ఫలితంగా జైలు నుండి విడుదలయ్యారు. గృహనిర్బంధంలో ఉన్న సుభాష్ చంద్రబోస్ కలకత్తా నుండి పారిపోయాడు.

**నేదునూరి కనకయ్య 9440245771**

(మిగతా వచ్చేవారం)

## నవ కవిత్వం

### మనసుసవ్వడులు!




హద్దులు లేని ఊహాలోకం లో
కళ్ళెం లేని గుర్రంలా
వాయువేగాన్ని మించిన వేగంతో
అనవరతం పరుగులుతీసే మనసు
సంకల్ప వికల్పాలతో
త్రికాలాలలోసంచరిస్తుంది

భూతకాలంలోకి వెళ్ళి
గత స్మృతుల జ్ఞాపకాల
దొంతరలో తిరుగాడుతూ
మధురాతి మధుర అనుభవాలను
నెమరువేసుకుంటుంది
చేదు జ్ఞాపకాల గాయాలను
గుర్తుచేసుకుంటుంది
భవిష్యత్తులోకి తొంగిచూస్తూ
ఆశల మోసులతో
బంగారు కలలు గంటుంది
గాలిలో మేడలు కడుతుంది
వర్తమానంలో వాస్తవిక జీవితాన
సుఖ సంతోషాలు వెల్లివిరిస్తే
ఆనంద డోలికల్లో తేలియాడుతుంది
కష్టాలు కడగండ్లు దాపురిస్తే
దిక్కుతోచక మౌనంగా రోదిస్తుంది
బహుముఖ పోకడలు గల మనసు
కష్టసుఖాల్లో, కలిమిలేముల్లో
చీకటివెలుగుల్లో, మంచీచెడుల్లో
మనిషికితోడునీడా!
సర్వకాల సర్వావస్థలందు
మనిషికిఅండాదండా!!

**పి.వి.ప్రసాద్, 9440176824**

## లేఖలు




**ముఖచిత్ర కథనం**

**ఈ వారం బాపు నాదకర్ణి గురించి ప్రత్యేకంగా రాసిన వ్యాసం చాలా బాగుంది. ఆయన రికార్డుల ప్రస్తావన బాఉగంది. ఆదివారం అనుబంధంలో ప్రచురించిన వ్యాసం చాలా విశేషాలన** అన్ని పత్రికలకు విభిన్నంగా భిన్న అంశాలను ముఖపత్ర కథనాలుగా ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి, యాజమాన్యానికి ధన్యవాదాలు. ఈ తరహా మరిన్ని కథనాలు ప్రచురించాలని కోరుతున్నా ము. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**
**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రా లలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుఫణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకు లకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరం దిస్తున్న ప్రోత్సాహం బాగుం ది. . రచిత కథనాన్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**


## భగ్నప్రేమికుడి - విరహాగ్ని దహనం!



మల్లెపూలు పూయించాలనుకున్న
నా ఎదపై
గులాబీ మొక్కని పాతి పోయింది
వాటి ముళ్ళన్నీ గుచ్చుకొని –
నా హృదయానికి వేల తూట్లు
పడ్డాయి.
ప్రేమ రసాన్ని తాపుతున్న నాకు –
నా దేహమంతా విషాన్ని
చిమ్మిపోయింది
నా సమాధిపై సన్నజాజుల్ని పేర్చింది
నా కళ్లెంబట రక్తధారల్ని ఊర్చింది.
అవునూ –
నేను ఇంకా వలపుగీతికల్ని
గుండెలవిసేలా పాడతాను
నా ఆత్మని ఆవిరి చేసి ఆడతాను.
మంచు పొరల్లా కమ్మిన నీ దౌష్ట్యాన్ని
భగభగ మండే భానుణ్ణయి ఆవిరి
చేస్తాను!
నీ మాటల ముళ్ళు – నా ఒళ్ళుని
సైతం – కాకి నోటిలా దెప్పాయి.
ఓ చెలీ..!
తెగిన నీ స్వార్థపు దారాన్ని ఉండలుగా
చుట్టుకో
నా లాంటి ఓ పేద మనస్సుని –
చూపులతో కన్నులు కట్టి,
నీ దగాకాశాన నిర్లజ్జగా
రెపరెపలాడించు
నీవాడిన ఈ నాటకాన
ఓ నిండు ప్రేమ బలి
నీ పేరుని నా రక్తాల్లోకి ఎక్కించాను
నా నిశ్వాసలో బయటికెళ్లే నీ ఊపిరిని
– నాలో ఇముడ్చుకున్నాను.
నువ్వింకా నాలో బంధీవే
నువ్విచ్చిన ముద్దుల మూలుగులు –
నన్నెక్కడ మీటినా
వేయి గొంతుకల్తో ప్రతిధ్వనిస్తాయి
నా దింపుడు కళ్ళెం కాడ నిన్ను
దిగంబరిగా చూశాను.
నీపై మోహం
అడుగంటుకుపోయిందిప్పుడు.
నా కళ్లెంబట నీ ముందు నిల్చొని
కడసారిగా కన్నీటి పర్యంతమవ్వ
యత్నిస్తాను
తెలుసూ – నాది వృధాప్రయాసేనని
ఇంతకుమించీ – నేనేం
చేయగలనూ?
హోరు గాలికి దీపం పెట్టి –
వెలగమంటే వెలుగుతుందా?
దాని స్వభావాన్ని గుండెల్లోకొంపి
మాయమవుతుంది!

**–బాలాజీ పోతుల**
**8179283830**







సూర్య బుడత

బాలల కథ



# ఏకాగ్రత





బాలయ్య ఊరగాయలు వ్యాపారం చేసేవాడు.అతనికి శర్వాణి కూతురు, సుజయ్ కొడుకు.శర్వాణి ఇంజనీరింగ్ చదువుతోంది.చదువులో ముందంజ లో ఉంటుంది. సుజయ్ చురుకైన పిల్లాడు.ప్రయివేట్ పాఠశాల లో ఎనిమిదవ తరగతి చదువు తున్నాడు. కాని చదువులో వెనుక బడి పోయాడు. సుజయ్ చదువులో వెనుక పడడటంతో తండ్రి బాలయ్య మదన పడి పోయేవాడు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడుతో చాలా సార్లు మాట్లాడాడు,సుజయ్ పై శ్రద్ధ చూపమని. ప్రతిరోజు క్రమం తప్పకుండా సుజయ్ పాఠశాలకువెళ్ళేవాడు.


అయినా ఎందుకో చదువు పై ఏకాగ్రత పెట్టేవాడు కాదు.కొన్నిరోజులు బాలు సుజయ్ మానసిక పరిస్థితిని గమనించి ఓ నిర్ణయానికి వచ్చాడు.తను చదివే ప్రయివేట్ పాఠశాల ఇరుకు గదుల్లో కిక్కిరిసి ఉండటం,ఆడుకోడానికి విశాలమైన ఆటస్థలం లేకపోవడం, పాఠశాల పనిగంటలు మొత్తం చదువు పేరుతో మానసికంగా యంత్రంలా తయారై శారీరక వ్యాయామం లేకపోవడం అని గ్రహించి ప్రభుత్వ పాఠశాలల్లో సుజయ్ ని చేర్పించాడు. అక్కడ విశాలమైన తరగతి గదులు, ఆడుకోవడానికి ఆటస్థలం ,వ్యక్తిగత శ్రద్ధ చూపే ఉపాధ్యాయులు ఉన్నారు.ఆరు నెలల్లో సుజయ్ లో మార్పు వచ్చింది. పాటలతో చదువుతూ ఉల్లాసంగా తన చదువును కొనసాగించి మంచి మార్కులు తెచ్చుకోవడం ప్రారంంభించాడు.పదవ తరగతిలో పాఠశాలకు ప్రథమ స్థాయిలో నిలిచి,ఆటల పోటీల్లో అనేక పతకాలు సాధించాడు.పిల్లలని నిత్యం చదువు పేరుతో బంధించి మానసిక ఉల్లాసాన్ని సృజనాత్మకతను ఇవ్వకపోతే దేనిపైనా ఏకాగ్రత ను ఉంచలేరని బాలయ్య గ్రహించాడు.సుజయ్ చదువుపై ఏకాగ్రత పెట్టి గాడిలో పడినందుకు తండ్రి బాలయ్య ఊపిరి పీల్చుకున్నాడు.

– కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

COLOR BY LETTERS












# ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనకు పామాయిల్ భరోసా



భారత్ ఇటీవల నిర్వహించిన మెగా ఆయిల్ ప్లాంటేషన్ డ్రైవ్ 2024 అనేది, దిగుమతులపై ఆధారపడటం తగ్గించుకుని, రైతుల ఆదాయాలను పెంచే దిశగా దేశ నిబద్ధతను ప్రతిఫలించే నేషనల్ మిషన్ ఆఫ్ ఎడిబుల్ ఆయిల్స్ %-% ఆయిల్ పామ్కి (ఎన్ఎంఈవో-ఓపీ) అనుగుణమైనదిగా ఉన్నది. జూలైలో పామాయిల్ దిగుమతులు 1.081 మిలియన్ టన్నులకు చేరిన తరుణంలో, 2030 నాటికి దేశీయంగా 3 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలంటే పాలసీపరంగా వ్యూహాత్మకమైన చర్యలు అవసరమవుతాయి. ఆయిల్ పామ్ సాగునకు సుదీర్ఘకాలం పడుతుంది కాబట్టి, ఈ వ్యవధిలో మద్దతును కల్పించేందుకు నాలుగేళ్లలో హెక్టారుకు రూ. 1.69 లక్షల మేర సహాయం లభించేలా ఎన్ఎంఈవో-ఓపీ కింద కీలక సబ్సిడీలు అందించడం చాలా ముఖ్యం. అయితే, డ్రిప్ ఇరిగేషన్ మొదలైన అంశాల్లో సవరణలు కూడా అవసరమవుతాయి. దీనికి సంబంధించి వ్యయాలు హెక్టారుకు రూ. 60,000గా ఉండగా ప్రస్తుతం రూ. 22,000 మాత్రమే సబ్సిడీ లభిస్తోంది. అలాగే, మరింత నాణ్యమైన విత్తనాలను సమకూర్చుకునేందుకు, నారుకోసం ప్రస్తుతం కేటాయిస్తున్న రూ. 29,000 మొత్తాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. దిగుబడులను పెంచుకోవడానికి, పంట చేతికొచ్చే వ్యవధిని తగ్గించడానికి ఇది చాలా కీలకాంశంగా ఉంటుంది.

అంతర్జాతీయంగా ప్లాంటేషన్లు చాలా భారీ స్థాయిలో ఉంటాయి. కానీ దేశీయంగా మాత్రం అందుకు భిన్నంగా, ఆయిల్ పామ్ రంగం ఎక్కువగా చిన్నకమతాలున్న రైతులపైనే ఆధారితమైనదిగా ఉంటోంది. ఫ్రెష్ ఫ్రూట్ బంచ్ (ఎఫ్ఎఫ్బీ) ధరలపరంగా మార్కెట్లో నెలకొనే ఒడిదుడుకుల నుండి రైతులకు రక్షణ కల్పించేందుకు వయబిలిటీ గ్యాప్ పేమెంట్ (వీజీపీ) విధానమనేది ధరపరంగా ఒక భరోసాగా ఉండగలదు. డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్లాంటి భారత డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలను ఉపయోగించుకుని, వీజీపీ నిధులను సకాలంలో వితరణ చేయొచ్చు. సబ్సిడీలను సమర్ధవంతంగా పంపిణీ చేయొచ్చు.

ప్రస్తుతం భారత్ ఎక్కువగా పామ్ విత్తనాల కోసం దిగుమతులపై ఆధారపడుతోంది. దేశీయ వాతావరణ పరిస్థితులకు అనువైన దేశీ వెరైటీలను అభివృద్ధి చేయడంపై ఇన్వెస్ట్ చేయాల్సిన అవసరాన్ని ఇది తెలియజేస్తోంది. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానమనేది ఆవిష్కరణలను, సస్టైనబిలిటీని పెంపొందించగలదు. అలాగే అధిక సాంద్రతతో మొక్కలు నాటడం, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడమనే ఉత్తమ విధానాలను పాటించడమనేది, పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకు దోహదపడగలదు. అడవుల నరికివేతరహితమైన విధంగా భారత్లో పామాయిల్ ఉత్పత్తి అనేది మార్కెట్లో ప్రయోజనకరమైన అంశంగా ఉండనుంది. ముఖ్యంగా ఈశాన్యరాష్ట్రాల్లో ఆయిల్ పామ్ సాగునకు సమృద్ధిగా అవకాశాలు ఉన్నాయి. ఆ ప్రాంతంలో అత్యధికంగా వర్షాలు కురవడం, స్థలం కూడా సమృద్ధిగా ఉండటమనేవి కలిసొచ్చే అంశాలు. అయితే, రవాణాపరమైన సవాళ్లు సహా మౌలిక సదుపాయాలపరమైన అంతరాల వల్ల పురోగతికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. క్లస్టర్లు ఒక స్థాయికి చేరే వరకు క్రూడ్ పామాయిల్ రవాణా కోసం సబ్సిడీలను ఇస్తే రైతులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. అలాగే ఉత్పత్తిని క్రమబద్ధీకరించేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. 2030 నాటికి భారత్ నిర్దేశించుకున్న పామాయిల్ లక్ష్యాన్ని సాధించాలంటే, రైతుల ఆందోళనలను పరిష్కరించడం, దేశీయంగా సామర్థ్యాలను పెంపొందించుకోవడం, పాలసీలను మెరుగుపర్చడం కీలకాంశాలుగా ఉంటాయి. ఈ విషయంలో విజయం సాధించడమనేది, గ్రామీణ ఎకానమీల్లో సుస్థిరమైన వ్యవసాయ విధానాలు పాటించడం వల్ల ఒనగూరే ప్రయోజనాలను తెలియజేస్తూ, భారత్ స్వీయ సమృద్ధిని సాధించే దిశగా చేసే ప్రయాణంలో ఒక కీలక మైలురాయిగా నిలవగలదు.

**బలరాం సింగ్ యాదవ్,**
**మేనేజింగ్ డైరెక్టర్,**
**గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్**



# సలహా (సెటైర్)



వ్యంగ్య దేశపు ప్రధానికి పెద్ద చిక్కు వచ్చిపడింది. మరో ఏడాదిలో ఎన్నికలకు వెళ్ళ బోతోంది దేశం. చాలా సర్వేలు చేయించాడు. తనకూ, తన పార్టీ కీ పరపతి ఎలా ఉందని వాకబు చేస్తే, ఏ గ్రాఫు లో చూసినా, గీత అడ్డ గీత దాటి క్రిందకి వెళ్ళి పోయింది. ఏటైమ్ లో జారి క్రిందకు పోయిందో, ప్రస్తుతం ఎక్కడుందో చెప్పలేమంటూ నిష్ణాతులంతా చేతులెత్తేశారు. ఇక లాభం లేదని సలహాదారుల తో మీటింగు పెట్టాడు. వాళ్ళంతా ఉదయం పిలిస్తే, సాయంత్రానికి వచ్చారు. ప్రధానికి బాగా అర్ధమైంది.. తన పరపతి పరిస్థితి.

"చూడండి జంటిల్మెన్. ఎన్నికలు త్వరలో రాబోతున్నాయి. నేను గెలిస్తేనే మీరుంటారు. మన పరపతి చూస్తే పాతాళం దిశగా పలాయనం చేసిందని తెలిసింది. కిం కర్తవ్యం?"

"అది మీరంటే గిట్టనివాళ్ళ పుకారు. మన పార్టీకి మీరు దేవుడు. మీకు ప్రజలు భక్తులు. నేను వాకబు చేయగా తెలిసింది.. వాళ్ళంతా మీకు బ్రహ్మోత్సవాలు లాంటివి చేద్దామనుకుంటున్నారని." అడ్వయిజర్ నంబర్ వన్ అర్ధనిమీలిత నేత్రాలతో ముగించాడు.

ప్రధాని ఆయన మొహంపై నీళ్లు చిలకరించి, అర్ధనిమీలిత నేత్రాలు పూర్తిగా విచ్చుకునే వరకూ చూసి చెప్పాడు. "ఇదుగో ఇలాంటి వార్తలతోనే ఇందాకా వచ్చింది. వాళ్ళు ఉత్సవాలు చేద్దామను కోవడం లేదు.. నన్ను, మన పార్టీని నిమజ్జనం చేద్దామనుకుంటున్నారు. ఎవరైనా పనికొచ్చే సల హా ఇవ్వండి. లేదంటే టీ, బిస్కట్లు తినడానికి మాత్రమే నోరు తెరవండి"

"ఇదంతా మీ వల్లనే సర్. మీ మీద జోకులు, కార్టూన్లు, మీమ్స్ వస్తున్నా చూసీ, చూడనట్టు వదిలేశారు. వాళ్ళందరినీ జైల్లో పెడితే సరిపోయేది. మీ మీద ప్రజల్లో భయమూ, భక్తి ఉండేవి."

" ఏడ్చినట్టుంది. ఉన్న పరువు పోయేది. ఉడుక్కుంటున్నట్టు అందరికీ తెలిసేది. ఎందుకిలా అయ్యిందో పక్కన బెట్టి, ఏం చెయ్యాలో అఘోరించండి."

"అయితే ఇబ్బడిముబ్బడి గా ప్రజలకు ఏమైనా పంచేద్దాం సర్,"

"డబ్బులెక్కడివి నాయనా. ఈ మీటింగులో మీకిచ్చిన టీ, బిస్కట్లుకే ప్రపంచ బ్యాంకు రుణం తీసుకున్నాం."

అందరూ బుర్ర గోక్కున్నారు. అందరూ కలిసి ఒక బుర్ర కాదు... ఎవరివి వారు. ఈలోగా సలహాదారు నెంబర్ వన్ కి రెండో ఉప సలహాదారు యొక్క సహాయ అదనపు సలహాదారు లేచి 'సర్, నేను చెప్పొచ్చా' అంటూ సిగ్గు నటిస్తూ నసిగాడు. సరేనన్నాడు ప్రధాని.

"మీరు ట్రోల్స్, మీమ్స్, కథలూ, కాకరకాయలూ బేధం లేకుండా, సకల హాస్య రూపకాలపై పన్ను విధించండి. అవి చదివిన వారు, చూసిన వారు కట్టాల్సిందే అనండి. అటు కామెడీ చేసే వారు తగ్గుతారు, లేదా ఇటు ఖజానా నిండుతుంది. మీరు ఉడుక్కున్నట్టు తెలీదు. పరపతి పెరగక పోయినా, మరింత ఉష్ట్ర పక్షిలాగా ఇసకలోకి దూరిపోవడం ఉండదు."

" ఉన్నంతలో నీ సలహా వెరైటీగా ఉంది గానీ ఏమని చెప్తాం ఈ జీఎస్టీ గురించి."

"ఏముందీ. వాళ్ళు నవ్వడం వల్ల ఆరోగ్యం పెరుగుతుంది. ఆరోగ్యానికి బీమా చేస్తే డబ్బులు కట్టరా ఏం? ఇదీ అలాగే. హాయిగా నవ్వుకుంటుంటున్నందుకు కొంచెం పన్ను కట్టుకోలేరా?"

ప్రధానికి ఐడియా నచ్చింది. ముందు తన మీద పబ్లిక్ లో జోకులు తగ్గుతాయి. అటు రాబడి పెరుగుతుంది. లేచి చప్పట్లు కొట్టాడు.సలహాదారులు చిడతలు కొట్టారు.

**(తర్వాత్తర్వాత వ్యంగ్య దేశపు ప్రజలేం కొట్టారో ఇంకో భాగం లో)**

***డా. డి వి. జి. శంకర రావు, మాజీ ఎంపీ,***
***పార్వతీపురం,విజయనగరం. %ూూ. 944083691.***

## సరికొత్త సీరియల్

# చాకిరేవు



(గతవారం తరువాయి).

ఎక్కడికి వెళ్ళావని ఎవరైనా అడిగితే పాపులమ్మ వంకగడ్డకు బట్టలు ఉతకడానికి వెళ్లిందని, ఇంకా రాలేదని, పిలుచుకురావడానికి వెళ్లాలని చెప్పేది. ఏదేదో తనలో తనే మాట్లాడుకునేది, బాపనోళ్ళ వీధిలోకి వెళ్లి ఇళ్ళ మీద మన్ను చల్లడం, మట్టికొట్టుకుపోతారని శపించేది. కొండారెడ్డి ఇంటి ముందుకెళ్లి నీ అంతు చూస్తానని, నిన్ను చంపకుండా వదలను అనేది. దాంతో వేముల ప్రజలు సుబ్బక్కను అదుపు చేసుకోవాలని గంగను హెచ్చరించారు. సుబ్బక్కను గుడిసె నుండి బయటకు పంపడం మానేసింది. కింద కూర్చోమంటే అమ్మో మట్టి ఉంది, మట్టిలో కూర్చోనని పిచ్చిగా, వెర్రిగా ప్రవర్తించేది.

మట్టిని చూస్తే హడలిపోయింది, మట్టి రేణువులు కనపడినా తట్టుకోలేకపోయింది, భయంతో పరుగులు పెట్టేది. సుబ్బక్కకు ఏమైందోనని గంగ, గంగులు, అచ్చక్క భయపడ్డారు. అలానే వదిలేస్తే తన ప్రాణాలకు ముప్పు ఉంటుందని పులివెందుల పెద్దాసుపత్రికి తీసుకెళ్లారు. రెండు రోజుల పాటు ఆసుపత్రిలోనే ఉండాలని వైద్యులు చెప్పారు.

నేనుంటానని గంగ చెప్పడంతో గంగులు, అచ్చక్క వేములకు వెళ్లిపోయారు. సుబ్బక్కను జనరల్ వార్డులో ఉంచి వైద్యం ఇవ్వడం మొదలెట్టారు.

సుబ్బక్క పక్క బెడ్డులో అనసూయమ్మ ఉంది. తనను చూసుకోడానికి మనవడు రాజా ఆసుపత్రికి వెళ్లేవాడు. అనసూయమ్మకు కంటి ఆపరేషన్ అయ్యింది. నాలుగు రోజుల పాటు ఆసుపత్రిలోనే ఉండాలన్నారు.

అనసూయమ్మకు ఒక కూతురు, ఇద్దరు కొడుకులు ఉన్నా ఎవరూ తన కోసం ఆసుపత్రిలో ఉండటానికి వెళ్లలేదు. మనవడు రాజా మాత్రం ప్రతి పూట వెళ్లేవాడు. అనసూయమ్మకు అవసరమైనవి ఇచ్చి, మా అమ్మమ్మను గమనిస్తూ ఉండమని గంగకు చెప్పాడు. అనసూయమ్మను స్నానాల గది వరకు తీసుకెళ్లడం, ఏమైనా అవసరమైతే ఇవ్వడం లాంటివి గంగ చేసింది. ఆ విధంగా గంగకు రాజాతో పరిచయం ఏర్పడింది.

పులివెందులలో రంగనాయకులస్వామి చాలా మహిమ గల దేవుడని, రేపు గుడికి వెళ్తున్నాని, నువ్వు కూడా వస్తావా? ఇద్దరం కలిసి వెళ్దామని అడిగాడు. వేములలో రామాలయంలో ఉన్న రాములవారిని గంగ కుటుంబసభ్యులు ఎవరూ చూసింది లేదు. గంగ కుటుంబసభ్యులు మాత్రమే కాదు దళితులకు కూడా గుడిలోకి అనుమతి లేదు. అదే విషయాన్ని రాజాకు చెప్పింది.

రాజా ఆశ్చర్యపోయాడు, పులివెందుల రంగనాయకుల గుడిలో అలాంటిదేమీ లేదని, ఎవరూ మనల్ని కులాన్ని, మతాన్ని అడగరని భరోసా ఇచ్చాడు. దాంతో గుడి లోపల ఎలా ఉంటుందో గంగ చూడాలనుకుంది.

పులివెందులలో రంగనాయకుల గుడి ఊరి బయట ఉంటుంది. అక్కడికి వెళ్లడానికి నడిచి వెళ్ళాల్సిందే కాబట్టి గుడికి వెళ్లి వచ్చే లోపు చాలా సమయం పట్టవచ్చని ఆసుపత్రిలో నర్సుకు చెప్పి ఇద్దరూ గుడికి బయలుదేరారు.

గుడి గోపురాన్ని కళ్ళు పెద్దవి చేసి చూసింది. దర్శనం కోసం అరగంట లైనులో నిలబడ్డారు. మామూలుగా అయితే జనాలు ఎక్కువగా ఉండరని, రంగనాయకుల ఉత్సవాలు జరుగుతున్నాయి కాబట్టి జనం ఎక్కువగా ఉన్నారని రాజా గంగకు చెప్పాడు.

వేములలో లాగా ఇక్కడ కులాన్ని, మతాన్ని బట్టి ఆలయంలోకి ప్రవేశం లేదని గంగకు తెలిసింది. అదేమీ ఆచారం, సంప్రదాయం, సంస్కృతి కాదనీ.. స్వామి, కొండారెడ్డి, పెద్దకోటయ్య, బాపనోళ్ళు కావాలనే చేస్తున్నారని అర్థం చేసుకుంది.

***

అనారోగ్యం, సరైన వైద్యం లేకపోవడం, వృద్ధాప్య కారణాలతో వరలక్ష్మి తండ్రి చనిపోయాడు. తల్లి ఒంటరిదయ్యింది, తనను ఇంట్లో పెట్టుకుందామంటే పెద్దకోటయ్య వినిపించుకోలేదు.

పులివెందులలో ఉన్న సత్రంలో తల్లిని చేర్పించింది. పిల్లలు బతికి ఉండగానే తల్లిని సత్రంలో వేయడాన్ని వరలక్ష్మి తట్టుకోలేకపోయింది. పెద్దకోటయ్యతో గొడవపడి పులివెందులలో ఉన్న తన తల్లిని చూడటానికి వెళ్లేది. తల్లి దగ్గర కాసేపు ఉండి, చిన్నకోటయ్యను కలిసి వచ్చేది. వారానికి ఒకసారి వెళ్తూ వస్తూ ఉండటంతో పెద్దకోటయ్యకు కోపం వచ్చింది.

'ఆడది ఇంట్లో ఉండాలి కానీ ఇలా బజార్లు, ఊర్లు పట్టుకొని తిరిగితే పల్లెలో నాకేం గౌరవం ఉంటుంది? అయినా ఇలా బతిమిలించి తిరుగుతావని నేనెప్పుడు అనుకోలేదు' కొవ్వుగా, పిచ్చికూతలు కూశాడు.

తండ్రిని కోల్పోవడం, తల్లిని దగ్గర పెట్టుకోలేకపోవడంతో వరలక్ష్మి తీవ్ర మనోవేదన చెంది ఉంది. పాపులమ్మ తల్లిని దగ్గర పెట్టుకుంది, మనవరాలు గంగ సుబ్బక్కను ప్రేమగా, బాధ్యతగా చూసుకుంటోంది. తను మాత్రం భర్తకు భయపడుకుంటూ తల్లిని సత్రంలో ఉంచాననే బాధ రోజు రోజుకు పెరిగిపోయింది. అదే సమయంలో పెద్దకోటయ్య మాటలు వరలక్ష్మి మరింత బాధించాయి. అది మాత్రమే కాకుండా పాపులమ్మ మరణానికి తానే కారణమని కుమిలిపోయింది.

'నువ్వు తాగితే తప్పు లేదు, తాగి పులివెందుల వేశ్యకొంపలకు వెళ్లినప్పుడు మర్యాద పోదు, మట్కా ఆడితే నీ పరువు మరింత పెరుగుతుంది కదా? నా తల్లిని, కన్నకొడుకును చూసుకోడానికి వెళ్తే మాత్రం బరితెగించింది అంటావా? ఇంకోమాట అంటే నేను ఇంట్లో ఉండనని, సత్రంలో తల్లికి తోడుగా వెళ్ళిపోతానని' సూటిగా చెప్పింది.

ఎప్పుడూ లేనిది భార్య అంత గట్టిగా మాట్లాడటం చూసి పెద్దకోటయ్య లోలోపల బెదురుకున్నాడు కానీ బయటకు మేకపోతు గాంభీర్యం ప్రదర్శించాడు.

'ఆడవాళ్లు బయట తిరగడం మా ఇంటా వంటా లేదన్నాడు'

'మగాడు తాగడం, తాగి వేశ్యల దగ్గరకు వెళ్లడం, మట్కా ఆడటం మీ ఇంటా వంటా ఉన్నాయా?'

'ఏంటే ఊరికే ఉన్నానని తెగ మాట్లాడుతున్నావు, పోతే.. పో, నువ్వు కాకపోతే మరొకదాన్ని చేసుకుంటాను' గొంతు పెంచాడు.

'ఒక్కదాన్ని కాకపోతే పదిమందిని చేసుకో, నాకు వచ్చే నష్టమేమీ లేదు. నాకు మా అమ్మే ముఖ్యం, నీకెన్ని సేవలు చేసినా ప్రతిఫలం లేకుండానే మాట్లాడుతావు. నీతో ఉండే కంటే వెళ్లిపోవడమే మంచిది.'

మరీ లాగితే తెగుతుందేమోనని ఏదేదో అరుచుకుంటూ బయటకు వెళ్లిపోయాడు. భార్య గొంతు ఒక్కసారి లేస్తే దాన్ని ఆపడం అసాధ్యం. వరలక్ష్మి మాటకు మాట బదులివ్వడం పెద్దకోటయ్య సహించలేకపోయాడు. కొన్ని రోజులు మౌనంగా ఉండటమే నయమనుకున్నాడు. భార్యను ఎక్కువగా కదలించకూడదనుకున్నాడు.

రెండు రోజుల తర్వాత అంగట్లో డబ్బు తక్కువ వచ్చింది. ఈరిగాడి మీద అనుమానపడ్డాడు. నేనే తీశానని, మా అమ్మకు అవసరమైతే పంపానని పెద్ద గొంతుతో చెప్పింది.

'నన్ను అడిగి తీసుకోవాల్సింది' నసిగాడు.

'నువ్వా.. నాకు చెప్పే అన్నీ చేస్తున్నావా? అయినా ఇంట్లో డబ్బును తీసుకోడానికి నీకెందుకు చెప్పాలి? నేనేమీ నీలాగా తాగుబోతు, తిరుగుబోతును కాదు' పనిచేసేవారి ముందే కసిరింది.

'తెలియకుండా డబ్బు తీస్తే దొంగతనం అంటారు' కోపంగా, ఆవేశంగా.

'జోబీలో ఉన్నది వెయ్యి రూపాయలైతే రెండు వేలని అబద్ధం చెప్పి పాపులమ్మతో పని చేయించుకున్నదాన్ని ఏమంటారు?' జుట్టు పట్టుకొని అడిగినట్టు అనిపించింది.

జోబీలో వెయ్యి రూపాయలే ఉన్న విషయం వరలక్ష్మికి ఎలా తెలుసు? అయినా ఈరిగాడి ముందు అవన్నీ బయటకు చెప్పేసింది. ఈరిగాడు పల్లెలో చెప్తే బండారం బయట పడుతుందని పెద్దకోటయ్య హడలి చచ్చాడు.

'పాపులమ్మను ఇంత మోసం చేశారా?' ఈరిగాడు బాధపడ్డాడు. పని ముగించుకొని సరాసరి గంగ గుడిసెకు వెళ్లి విషయం చెప్పేశాడు.

మరుసటి రోజు గంగ పెద్దకోటయ్య ఇంటి మీదకు వెళ్లి గొడవ చేసింది. నా తల్లి మీద దొంగతనం నేరం కావాలనే మోపి, బండచాకిరీ చేయించుకున్నారు. నా తల్లిదండ్రులను చంపిన హంతకులు మీరంటూ గట్టి గట్టిగా కేకలు వేసింది. పల్లె ప్రజలంతా గుమ్మిగూడారు, ఈరయ్య చెప్పిన విషయాన్ని గంగ అందరికీ చెప్పింది.

వరలక్ష్మి ఇంట్లో నుండి బయటకు వచ్చి 'గంగా.. నన్ను క్షమించు, ఆ డబ్బు తీసుకున్నది మీ అమ్మ కాదు, నేనే. అందులో రెండు వేలు కాదు వెయ్యి రూపాయలే ఉన్నింది. మా నాన్నకు ఆరోగ్యం బాగలేకపోతే తాగి ఉన్న పెద్దకోటయ్య మర్చిపోయి ఉంటాడని, నేనే ఆ డబ్బును మా అమ్మానాన్నలకు పంపాను.'

నా అన్నా, వదినల చావుకు కారణమైన పెద్దకోటయ్యను చంపేస్తానని గంగులు పెద్దకోటయ్యను చితకబాదాడు. పెద్దకోటయ్యకు తల తీసేసినట్టు అయ్యింది. రెడ్లు, బాపనోళ్ళు కొట్టి ఉంటే అంత బాధపడేవాడు కాదు గంగులు కొట్టడంతో కుమిలి కుమిలి ఏడ్చాడు.

పెద్దకోటయ్య, వరలక్ష్మిని గంగ పంచాయితీలో నిలబెట్టింది. వరలక్ష్మి నేరం ఒప్పుకుంది కాబట్టి పల్లె పెద్దలు ఏమీ అనలేకపోయారు.

'తన తల్లిని ఇంట్లో పెట్టుకోడానికి ఒప్పుకోలేదని వరలక్ష్మి కావాలనే చెపుతోందని పెద్దకోటయ్య వాదించాడు, కొండారెడ్డి సమర్థించాడు.'

నా తల్లిని ఇంట్లో పెట్టుకోకపోవడానికి, దీనికి ఎలాంటి సంబంధం లేదని.. ఆ డబ్బు నేనే తీసిందని వరలక్ష్మి ఖరాఖండిగా చెప్పేసింది. దాంతో పల్లె పెద్దలు పెద్ద కోటయ్యను తిట్టారు. అన్యాయంగా పాపులమ్మ మీద దొంగతనం నేరం వేశారని అరిచారు. నీకేం కావాలో చెప్పమ్మా అంటూ గంగను పల్లె పెద్దలు అడిగారు.

గర్భవతని కూడా చూడకుండా నా తల్లితో అంగట్లో చాకిరి చేయించుకున్నాడు. దొంగతనం నేరం మీద పడటంతో నా తల్లి కుళ్లి కుళ్లి ఏడ్చింది. బట్టలు పోయాయని స్వామి, దొంగతనం చేసిందని పెద్దకోటయ్య ఆరోపించారు, నిందలు వేశారు. దానివల్లే నేను, నారాయణ, గౌరీ అనాథలయ్యాము. చాకిరీ చేసినందుకు డబ్బు కట్టివ్వాలని, తప్పు చేయకపోయినా దొంగతనం నేరం మోపారు కాబట్టి రెండేళ్ల వరకు మా నెలవారీ సరుకులను ఉచితంగా ఇవ్వాలని అడిగింది.

ఆవేశంగా, కోపంగా అరుస్తూ 'ఇదెక్కడి న్యాయం?' పెద్దకోటయ్య గట్టిగా అరిచాడు.

'పంచాయితీలో న్యాయం జరగకపోతే పోలీసులను ఆశ్రయించడం తప్ప మరో మార్గం లేదనింది.' కొండారెడ్డితో పాటు పల్లె పెద్దలు కూడా హడలిపోయారు.

'చూడమ్మా గంగ, నువ్విలా మాట్లాడటం సరికాదు. మేము నీ కోసం మాట్లాడుతున్నాము కదా! పల్లె ఆచారం, ఆనవాయితీ తెలియదా నీకు? ఇప్పటివరకు మన పల్లెకి పోలీసులు వచ్చింది లేదు. మన సమస్యలను మనమే పరిష్కరించుకుంటూ వస్తున్నాము.'

'మీ దగ్గర న్యాయం జరగకపోతే, మరో మార్గం లేదు. పులివెందులలో రంగనాయకుల ఆలయంలోకి అందరికీ అనుమతి ఉంది. మన పల్లెలో మాత్రం లేదు, ఇదేనా మీరు ఇన్ని సంవత్సరాలుగా చేసిన, చేస్తున్న న్యాయం?' దళితులు, బహుజనులు గట్టి గట్టిగా ఈలలు, కేకలు వేశారు, చప్పట్లు కొట్టారు. పంచాయితీ పెద్దల గుండెలు అదిరాయి. ఇన్నేళ్ళుగా ఎవరూ అడగలేని ప్రశ్నను గంగ అడగటాన్ని చూసి జడుసుకున్నారు.

'పులివెందుల సంగతి మనకెందుకు? రామాలయంలోకి దళితులు, బహుజనులకు ప్రవేశం వందల సంవత్సరాల నుండి లేదు. ఇప్పుడు కొత్తగా ఎలా వస్తుంది? అయినా ఆ విషయం గురించి నీకు అనవసరం' పల్లె పెద్ద హుంకరించాడు.

'ఎందుకు అవసరం లేదు, నన్ను కూడా గుడిలోకి రానివ్వడం లేదు కదా? దాని సంగతి తర్వాత తేలుద్దాం కానీ ముందు నా సమస్య గురించి తేల్చండి' చెంపలు అదిరేలా కొట్టినట్టు అడిగింది.

గంగతో పెట్టుకుంటే అనవసరంగా సమస్యలలో పడతామని పల్లెపెద్దలు గంగ కోరినట్లే రెండేళ్ల పాటు పెద్దకోటయ్య గంగకు సరుకులు ఇవ్వడమే కాకుండా పదివేల రూపాయలను రెండు నెలల్లో అందివ్వాలని తీర్పునిచ్చారు.

పల్లెలో పెద్దరికంగా బతుకుతున్న తనను బజారుకు ఈడ్చిందని వరలక్ష్మి మీద పెద్దకోటయ్య కోపం పెంచుకున్నాడు. భార్యతో మాట్లాడటం మానేశాడు, వరలక్ష్మి పెద్దకోటయ్యకు భయపడటం మానేసింది.

రెండు నెలల సమయం ఇచ్చినా వారం రోజుల్లోనే గంగకు పెద్దకోటయ్య డబ్బు ఇచ్చేశాడు. పెద్దకోటయ్య దగ్గర సరుకులు కొనకూడదని దళితులు, బహుజనులతో పాటు చాలామంది నిర్ణయించుకున్నారు.

నెలకు ఒకసారి పులివెందులకు వెళ్లి తెచ్చుకోవాలని కొందరు, పక్క పల్లెలో జరిగే సంతకు వెళ్లినప్పుడు సరుకులు తెచ్చుకుంటే సరిపోతుందని మరికొందరు అనుకున్నారు. దాంతో పెద్దకోటయ్య అంగడి సరిగా జరగలేదు.

వరలక్ష్మి వల్లే తనకు పల్లెలో అవమానం జరిగిందని, అంగడి సరిగా జరగలేదని ద్వేషాన్ని పెంచుకున్నాడు. నిద్రపట్టలేదు, తినడం మానేశాడు, అగ్గిలా రగిలిపోయాడు. వరలక్ష్మి పడుకొని ఉన్న సమయంలో తన ముఖం మీద తలదిండు పెట్టాడు. వరలక్ష్మి విడిపించుకోడానికి ప్రయత్నం చేసి విఫలమయ్యింది. దున్నపోతు లాంటి శరీరంతో వరలక్ష్మి మీద పడ్డాడు. బలంగా కుమ్మాడు, తలదిండుతో అయితే చనిపోవడం లేదని గొంతు నులిమాడు.

పెద్దకోటయ్య ఉన్మాదిలా, పిచ్చివాడిలా అయిపోయాడు. విచక్షణ కోల్పోయి భార్యను కడతేర్చాడు. ఒక్కప్పుడు వరలక్ష్మిని ప్రేమించిన, ఇష్టపడిన పెద్దకోటయ్య.. ఎదురుతిరిగిందని చంపేశాడు.

పెద్దకోటయ్య ప్రేమ నిజమేనా? ప్రేమ పేరుతో వరలక్ష్మిని పొందాడా? ప్రేమలో ప్రేమ మాత్రమే కాకుండా ద్వేషం, ఆవేశం, అనాలోచితం, మూర్ఖత్వం కూడా ఉంటుందా? చనిపోయేంత ప్రేమ, చంపేంత ప్రేమ రెండూ జీవితాలకు మంచిది కాదు. ప్రేమ కంటే జీవితమే గొప్పది. ప్రేమ కోసం చనిపోయినా, చంపినా.. అది ప్రేమ కానే కాదు, దానికి సమాజంలో అనేక పేర్లు ఉన్నాయి.

(మిగతా వచ్చేవారం)

జాని తక్కెడశిల
7259511956






## మడమ తిప్పని మహా నాయకుడు


# భారతరత్న కర్పూరి ఠాగూర్

**దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసి, చురుకైన పాత్ర పోషించి, మరణానంతరం 36 సంవత్సరాల తరువాత దేశంలో అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న అందుకోవడం అనేది అత్యంత అరుదైన ఘనత. అలాంటి గొప్ప వ్యక్తుల్లో ఒకరే భారతరత్న కర్పూరి ఠాగూర్. అప్పటి బ్రిటిష్ ఇండియా ప్రావిన్సోని బీహార్ రాష్ట్రం సమస్తిపూర్ జిల్లా పితాంజియా గ్రామంలో, ఒక నిరుపేద (నాయి బ్రాహ్మణ, మంగలి) కుటుంబంలో 1924 జనవరి 24న గోకుల్ ఠాగూర్, రామ్ దులారి దేవి దంపతులకు ఆయన జన్మించారు. సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేసిన కర్పూరి ఠాగూర్, భారత రాజకీయాల్లో తన నిబద్ధత, సేవలతో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన ప్రత్యేకించి వెనుకబడిన తరగతుల హక్కుల కోసం పోరాటం చేశాడు మరియు సామాజిక సమానత్వం కోసం జీవితాంతం కృషి చేశాడు.... సంబంధించిన వివరాలలోకి వెళితే....**

**– డా. జంపాల రాజేష్ ి రిసెర్చ్ స్కలార్ – ఉస్మానియా విశ్వ విద్యాలయం**

కర్పూరి ఠాగూర్ ఒక పేద కుటుంబంలో జన్మించారు. చిన్ననాటి నుంచే విద్యకు ప్రాధాన్యత ఇచ్చిన ఆయన, ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువు మధ్యలోనే ఆపవలసి వచ్చింది. అయినప్పటికీ, బాల్యం నుంచే చదువులో రాణిస్తూ విద్యార్థి నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్లో చేరి స్వాతంత్ర్య ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. తన గ్రామంలో ఉపాధ్యాయునిగా కూడా పనిచేసిన కర్పూరి ఠాగూర్, 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, 26 నెలలు జైలు శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో సత్యనారాయణ సిన్హా, మహాత్మా గాంధీ వంటి ప్రముఖులతో కలిసి పనిచేశారు. అయితే, సిద్ధాంత పరంగా భిన్నమైన అభిప్రాయాలతో రామ్ మనోహర్ లోహియాతో కలిసి సోషలిస్ట్ భావాలను ప్రచారం చేశారు. రాజకీయ ప్రస్థానం: కర్పూరి ఠాగూర్ సోషలిస్ట్ పార్టీ అభ్యర్థిగా 1952లో తేజ్ పూర్ నియోజకవర్గం నుంచి బీహార్ విధాన సభకు ఎన్నికయ్యారు. ఈ విజయం ఆయన రాజకీయ ప్రస్థానానికి మైలురాయిగా నిలిచింది. 1960లో ఉద్యోగుల హక్కుల కోసం పోరాటానికి నాయకత్వం వహించి, అరెస్టయ్యారు. ఆ తర్వాత టెల్కో కార్మికుల సమస్యలపై 28 రోజుల పాటు అమరణ నిరాహార దీక్ష చేపట్టారు.

విద్యా సంస్కరణలు: 1967లో బీహార్ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన ఆయన, విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. మెట్రిక్యులేషన్ పాఠ్యాంశాలను సవరించి, అందరికీ అర్థమయ్యే విధంగా ఉండేలా ప్రాంతీయ హిందీ భాషను ప్రోత్సహించారు. ఈ సంస్కరణలు విద్యా రంగంలో సమానత్వం కోసం ఆయన చేసిన కృషికి నిలువెత్తు ఉదాహరణగా నిలిచాయి. కర్పూరి ఠాగూర్ జీవితమంతా సామాజిక న్యాయానికి అంకితమైంది. ప్రజల కోసం నిరంతరం శ్రమించిన ఆయన, సామాజిక సమానత్వం, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం చారిత్రక పోరాటాలు సాగించారు. కర్పూరి ఠాగూర్ 1970–1971, 1977–1979 మధ్య రెండు పర్యాయాలు బీహార్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి హోదాలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 1970 డిసెంబర్లో యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ తరఫున బీహార్ 11వ కాంగ్రెస్ యేతర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. మొదటిసారి ఆరు నెలల కాలంలోనే తన పాలనలో సామాజిక సమానత్వానికి మార్గదర్శకంగా నిలిచారు. 1977లో రెండోసారి ముఖ్యమంత్రిగా ఎన్నికై మరింత సమర్థవంతంగా పాలన సాగించారు.




కర్పూరి ఫార్ములా:సామాజిక సమానత్వాన్ని బలపర్చడానికి కర్పూరి ఠాగూర్ రూపొందించిన "కర్పూరి ఫార్ములా" ప్రధాన మైలురాయి. ఈ విధానం వెనుకబడిన తరగతుల (ఓబిసి) విద్యార్హతలు ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు ప్రాధాన్యతనిచ్చింది. ఆయన 26% రిజర్వేషన్లను అమలు చేయడం ద్వారా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశాలను సృష్టించారు. ఈ ఫార్ములా భారతదేశ రిజర్వేషన్ విధానానికి బలమైన దారితీసింది. ఆయన సమానత్వం అనే భావనను కార్యరూపం దాల్చి, సామాజిక అభ్యున్నతికి బాటలు వేసారు. సంపూర్ణ మద్యపాన నిషేధం మద్యపాన దుష్ప్రభావాలను అరికట్టడంలో కర్పూరి ఠాగూర్ చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేసి, అనేక కుటుంబాలను అభివృద్ధి దిశగా నడిపారు. ఈ చర్య సామాజిక ఆరోగ్యం మరియు సామాజిక శాంతికి బలమైన ఆధారం అయింది.


**(మిగతా 8వ పేజీలో)**

( 7వ పేజీ తరువాయి)

మద్యపానం ద్వారా ఏర్పడే ఆర్థిక, సామాజిక సమస్యలను సమూలంగా తగ్గించడంలో ఆయన కలిగించిన ప్రభావం అపారమైనది. విద్యా వికాసానికి కృషి:కర్పూరి ఠాగూర్ విద్య రంగానికి విశేష ప్రాధాన్యత ఇచ్చారు. రాష్ట్రంలో అనేక విద్యాసంస్థలను స్థాపించి, విద్యను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకువచ్చారు. పేదలు, వెనుకబడిన వర్గాల విద్యార్థులు విద్యలో రాణించేందుకు అనేక పథకాలను ప్రవేశపెట్టారు. పాఠ్యాంశాలలో మార్పులు చేసి, ప్రాంతీయ హిందీ భాషను ప్రోత్సహించడం ద్వారా సమాజంలో సమాన అభివృద్ధికి కృషి చేశారు.

అణగారిన వర్గాల పట్ల నిబద్ధత:కర్పూరి ఠాగూర్ అణగారిన వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి జీవితాంతం పాటుపడ్డారు. వెనుకబడిన కులాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, రాజకీయ ఒత్తిళ్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. సామాజిక న్యాయానికి అంకితమైన ఆయన, వెనుకబడిన వర్గాల్లో విద్యా, ఉద్యోగ రంగాల్లో వెలుగు నింపారు. ఆయన నాయకత్వం సమానత్వానికి ప్రతీకగా నిలిచి, భారత రాజకీయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. వ్యక్తిగత జీవితం %-% నిరాడంబరతకు ప్రతిరూపం:కర్పూరి ఠాగూర్ నిరాడంబర జీవితాన్ని గడిపారు. రాజకీయాల్లో ఉన్నప్పటికీ ఆయనకు అధికారం గురించి ఎలాంటి దురాశలుండేవి కావు. సాదాసీదా వేషధారణతో, ప్రజల మధ్య ఆయన ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేవారు. ప్రజల సమస్యలను నేరుగా అర్థం చేసుకుని, వాటికి పరిష్కారాలు చూపడమే ఆయన ధ్యేయం. ప్రజల సమస్యల పట్ల ఆయన చూపిన నిబద్ధత, అపారమైన దయాగుణం కారణంగా ఆయన "జననాయకుడు"గా ప్రశంసించబడ్డారు. రాజకీయంగా ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ, ఆయన ఎల్లప్పుడూ సామాన్యుడిలా జీవించారు.

ఆచరణలో సాధారణత:అదనపు సౌకర్యాలు, ప్రోటోకాల్ వంటి విషయాలను ఆయన దూరంగా ఉంచేవారు. ఆయనకు రాజకీయంలో ఉన్నతమైన పదవులు వచ్చినప్పటికీ, జీవితంలో సాధారణతను, ప్రామాణికతను పాటించారు. ప్రజల మధ్య సర్దుబాటు చేయడంలో, వారి సమస్యలను వ్యక్తిగతంగా పరిష్కరించడంలో ఆయన అనితరసాధ్యమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ప్రజల సేవే ఆయన జీవిత లక్ష్యంగా ఉండేది.



కర్పూరి ఠాగూర్ జీవితం నిరాడంబర జీవనశైలికి మార్గదర్శకంగా నిలిచింది.

సామాజిక న్యాయం పట్ల నిబద్ధత:సమాజంలోని అణగారిన వర్గాల కోసం కర్పూరి ఠాగూర్ ఎప్పుడూ శ్రమించారు. సామాజిక న్యాయం అనేది ఆయన జీవితాన్నే కాదు, రాజకీయ వ్యవహారాలను కూడా నడిపించిన ప్రధాన శక్తి. ఆయన ప్రవేశపెట్టిన కర్పూరి ఫార్ములా సామాజిక సమానత్వానికి గట్టి పునాది వేసింది. రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కొంటూనే సామాజిక న్యాయాన్ని స్థాపించడంలో ఆయన చూపిన ధైర్యం అద్భుతం. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే ఆయన జీవితంలో ప్రధాన లక్ష్యంగా నిలిచింది. మరణం %-% ఒక మహోన్నత నాయకుడి అస్తమయం: కర్పూరి ఠాగూర్ 1988 ఫిబ్రవరి 17న కన్నుమూశారు. ఆయన మరణం దేశ రాజకీయాల్లో ఒక శూన్యతను మిగిల్చింది. ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలు మాత్రమే కాదు, దేశమంతా ఆయన లేని లోటును అనుభవించింది. సమానత్వం, న్యాయం కోసం కర్పూరి ఠాగూర్ చేసిన కృషి ఆయన చరిత్రలో సుదీర్ఘ స్ఫూర్తిగా నిలిచింది. కర్పూరి ఠాగూర్ జీవితం, ఆచరణలు సామాజిక న్యాయం కోసం శ్రమించాలనే సంకల్పానికి నిదర్శనం. ఆయన చరిత్ర భారతదేశ సామాజిక సమానత్వ పోరాటానికి మైలురాయిగా నిలిచింది. కర్పూరి ఠాగూర్ రూపంలో భారతదేశం ఒక నిజమైన ప్రజాస్వామ్య నాయకుడిని చూసింది. సమాజానికి ఆయన అందించిన మార్గదర్శకత, ప్రేరణ తరతరాలకు ఆదర్శంగా నిలుస్తుంది.




# కొబ్బరి బొబ్బట్లు

ఎలాంటి ఆహారాలు తిన్న అప్పుడప్పుడు స్వీటు తినాల్సిందే. అలా అని స్వీట్లు పూర్తిగా బయట కొనుక్కొని తింటే ఎలా కొన్నిసార్లు ఇంట్లో కూడా వండుకోవాలి. బొబ్బట్లు లేదా భక్ష్యాలు వీటి పేరు చెబితేనే నోరూరిపోతుంది. ఇప్పుడు ఒకేలాంటి బొబ్బట్లు కాకుండా ఒకసారి ఈసారి కాస్త ప్రత్యేకంగా కొబ్బరి బొబ్బట్లు వండేందుకు చూడండి. కొబ్బరి బొబ్బట్లు బయట మార్కెట్లో దొరకవు. మీరు ఇంట్లోనే వండుకోవాలి. చాలా సులువుగా కొబ్బరి బొబ్బట్లు వండేయచ్చు. వీటి రెసిపీ ఎలాగో తెలుసుకోండి.

**కొబ్బరి బొబ్బట్లు రెసిపీకి కావలసిన పదార్థాలు**

మైదా లేదా గోధుమపిండి - ఒక కప్పు
నెయ్యి - పావు కప్పు
ఉప్పు - చిటికెడు
యాలకుల పొడి - అర స్పూను
కొబ్బరి తురుము - ఒక కప్పు
బెల్లం తురుము - ఒక కప్పు
పసుపు - నీళ్లు తగినన్ని
నూనె - ఒక స్పూను

**కొబ్బరి బొబ్బట్లు రెసిపీ**

- మైదా లేదా గోధుమపిండి రెండిట్లో ఏదో ఒకదాన్ని ఎంచుకోవచ్చు.
- మార్కెట్లో మైదాతోనే అధికంగా చేస్తారు, కానీ మైదాని వాడడం ఆరోగ్యానికి హానికరం.
- కాబట్టి గోధుమ పిండిని ఎంపిక చేసుకోవడం ఉత్తమం.
- గోధుమపిండిలో ఉప్పు, పసుపు ఒక గిన్నెలో వేసి బాగా కలుపుకోవాలి.
- కొంచెం కొంచెంగా నీళ్లు కలుపుతూ దాన్ని పూరీ పిండిలాగా కలుపుకోవాలి.
- కాకపోతే కాస్త పల్చగా వచ్చేలా చూసుకోవాలి. ఇందులో ఒక స్పూన్ నూనె వేయడం మర్చిపోవద్దు.
- కొబ్బరి నూనె వేస్తే మరీ మంచిది. ఒక 20 నిమిషాల పాటు ఈ పిండిని మూత పెట్టి పక్కన పెట్టేయాలి.
- ఇప్పుడు స్టవ్ మీద గిన్నె పెట్టి బెల్లం తురుమును వేయాలి.
- అలాగే నీళ్లు కూడా వేసి బెల్లాన్ని కరిగేలా చేయాలి.
- బెల్లం నీళ్లల్లాగా కరిగాక అందులో ఉన్న మలినాలను తీసేయాలనుకుంటే దీన్ని చల్లార్చి వడకట్టవచ్చు.
- ఎలాంటి మరణాలు లేకపోతే అలానే ఉంచి వేడి చేయాలి. 12. ఇప్పుడు అందులో తాజా కొబ్బరి తురుమును, యాలకుల పొడిని వేసి బాగా కలుపుకోవాలి.
- ఇదంతా దగ్గరగా గట్టిగా అయ్యేవరకు కలుపుతూనే ఉండాలి. తర్వాత స్టవ్ ఆఫ్ చేయాలి.
- ఇప్పుడు ముందుగా కలిపి పెట్టుకున్న పిండి నుంచి కొంత ముద్దను తీసి చిన్న పూరీలాగా వత్తాలి.
- మధ్యలో ఈ కొబ్బరి మిశ్రమాన్ని ఉంచి మడత పెట్టాలి.
- ఇప్పుడు దాన్ని మళ్ళీ బొబ్బట్లులాగా ఒత్తుకోవాలి.
- స్టవ్ మీద పెనం పెట్టి నెయ్యి వేయాలి. ఆ నెయ్యిలో ఒత్తుకున్న బొబ్బట్లు రెండు వైపులా దోరగా కాల్చుకోవాలి.
- తర్వాత తీసి ప్లేట్లో వేయాలి. పైన నెయ్యిని అద్దాలి.
- అంతే టేస్టీ కొబ్బరి బొబ్బట్లు రెడీ అయినట్టే. దీన్ని వండుతున్నప్పుడే నోరూరిపోతుంది.
- ఒక్కసారి తిన్నారంటే మళ్ళీ మళ్ళీ తినాలనిపించేలా ఉంటుంది.
- ఈ కొబ్బరి బొబ్బట్లు అతిథులకు వడ్డించి చూడండి. కచ్చితంగా నచ్చుతాయి.



ముఖ్యంగా పండుగలు, ఇంట్లో పుట్టినరోజులు, పెళ్లిరోజులు ఇతర వేడుకల సమయంలో స్వీట్లు కొనేకన్నా ఇలా కొబ్బరి బొబ్బట్లు చేసి పెడితే శుచిగాను, శుభ్రంగాను టేస్టీగాను వస్తాయి. వీటి రుచి కూడా అద్భుతంగా ఉంటుంది. అయితే మైదాపిండి బదులు గోధుమ పిండిని వాడడమే ఉత్తమమని గుర్తుపెట్టుకోండి. మైదాలో రసాయనాలు ఉంటాయి. బయట మార్కెట్లో కేవలం మైదాతో చేసిన బొబ్బట్లు మాత్రమే లభిస్తాయి. కాబట్టి ఇంట్లోనే ఆరోగ్యకరంగా గోధుమ పిండితో బొబ్బట్లు లేదా భక్ష్యాలను చేసుకోవడం ఉత్తమం.

# అత్యంత పురాతన లగ్జరీ సింగిల్ మాల్టు, క్రేజీ కాక్ రేర్ మరియు దువా

మనం తినే ఆహార పదార్థాలు, డ్రింక్ లు ఆకర్షణీయంగా కనిపించేందుకు వాడే సింథటిక్ కలర్ రెడ్ డై 3పై అమెరికా నిషేధం విధించింది. రెడ్ డై 3 అనేది ఆహార పదార్థాలకు చెర్రీ పండ్ల వంటి ఆకర్షణీయమైన ఎరుపు రంగును అందిస్తుంది. దీన్ని రెడ్ నంబర్ 3 అని కూడా పిలుస్తారు. ఎందుకు దీన్ని నిషేధించారో ఇప్పుడు తెలుసుకుందాం.

**క్యాన్సర్ కారక లక్షణాలు**

లాబొరేటరీలో మగ ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో ఈ రంగు క్యాన్సర్ కారక లక్షణాలను చూపినట్లు పరిశోధనలు స్పష్టం చేశాయి. ఈ అధ్యయన ఫలితాల ఆధారంగా అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ రెడ్ డై 3ను నిషేధించింది. అయితే ఈ పరిశోధనల్లో ఉపయోగించిన రంగు పరిమాణం సాధారణంగా ఆహారాల్లో వాడే పరిమాణానికి చాలా ఎక్కువ. అయినప్పటికీ అమెరికా చట్టం ప్రకారం క్యాన్సర్ సంబంధిత అనుమానం ఉన్న పదార్థాలపై నిషేధం తప్పనిసరి.

**ఆహారాలు, మందులలో వినియోగం**

రెడ్ డై 3ని ముఖ్యంగా మిఠాయిలు, కేకులు, ఫ్రోజెన్ డెజర్ట్స్, కుకీలు, ఫ్రాస్టింగ్లలో వాడతారు. ఇంకా, దగ్గు సిరప్లు, విటమిన్ గమ్మీలు వంటి మందులలోనూ దీన్ని ఉపయోగ్గిరు. 2027 జనవరి నాటికి ఆహార ఉత్పత్తులు, 2028 నాటికి ఔషధ తయారీదారులు ఈ రంగును ఉపయోగించడం నిలిపివేయాలని ఎఫడిఏ స్పష్టం చేసింది.
అమెరికా ఇప్పటికే 35 ఏళ్ల క్రితం కాస్మెటిక్ ఉత్పత్తులలో రెడ్ డై 3 వినియోగాన్ని నిషేధించింది. అయితే అదే రంగును పిల్లలు తినే ఆహారాల్లో అనుమతించడం వలన ఇప్పుడు ఈ రంగుపై విమర్శలు



వచ్చాయి. వినియోగదారుల మేలు కోసం పని చేసే సెంటర్ ఫర్ సైన్స్ ఇన్ ది పబ్లిక్ ఇంటరెస్ట్ లాంటి సంస్థలు దీని నిషేధానికి పిటిషన్ వేశారు.

**వినియోగదారుల ఆరోగ్యం పై ప్రభావం**

రెడ్ డై 3కు బదులుగా కొందరు తయారీదారులు ఇప్పుడు రెడ్ డై 40ను ఉపయోగిస్తున్నారు. ఇది కొంత ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా పరిగణించినప్పటికీ.. ఎలుకలపై నిర్వహించిన కొన్ని ప్రయోగాల్లో జీర్ణ సంబంధిత సమస్యలకు ఇది కారణం కావచ్చని తేలింది. ఇదే సమయంలో బ్రిటన్ ఫుడ్ స్టాండర్డ్స్ ఏజెన్సీ పిల్లలలో హైపర్ యాక్టివిటీకి రెడ్ డై 40 కారణం కావచ్చని తెలిపింది.

**విదేశీ నిషేధాలు**

కాలిఫోర్నియా ఇప్పటికే 2023లో ఆహార పదార్థాలలో రెడ్ డై 3 వాడకాన్ని నిషేధించింది. ఇదే విధంగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్ దేశాలు ఈ రంగుపై ఆంక్షలు విధించాయి. అమెరికా నిషేధం నెమ్మదిగా అమలవుతున్నప్పటికీ ఇది వినియోగదారుల ఆరోగ్యానికి పునాది వేయగలదు.

**తయారీదారుల స్పందన**

నేషనల్ కన్ఫెక్షనర్స్ అసోసియేషన్  ఈ నిషేధాన్ని స్వాగతించింది. మిఠాయి కంపెనీలకు వినియోగదారుల భద్రత తొలి ప్రాధాన్యం అని నేషనల్ కన్ఫెక్షనర్స్ అసోసియేషన్ వెల్లడించింది. ఈ నిషేధం కారణంగా తయారీదారులు ఇప్పటికే ప్రత్యామ్నాయాలను అన్వేషించసాగారు. రెడ్ డై 3పై తీసుకున్న ఈ నిర్ణయం వినియోగదారుల ఆరోగ్యం కోసం కీలకమైనది. దీని ఫలితంగా ఆహార రంగంలో మరింత సురక్షితమైన మార్గాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# తినేటప్పుడు ఉప్పు డబ్బాను పక్కనే పెట్టుకుంటున్నారా?

తినేటప్పుడు ఉప్పు డబ్బాను పక్కనే పెట్టుకుంటున్నారా?

ఎంత మంచి వంటకమైనా సరే.. ఉప్పు లేకుంటే రుచిగా ఉండదు. ఉప్పు, కారం సరిగ్గా ఉంటేనే దాని రుచి మరింత పెరిగి.. మన జిహ్వాకూ రుచిస్తుంది. కానీ, కొంతమంది వీటి మోతాదుకు మించి వాడుతుంటారు. ఫలితంగా ఉప్పు వాడకం మితిమీరి బీపీ, హైపర్టెన్షన్, మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.అందుకే ఉప్పును తగ్గించుకునేందుకు కొన్ని చిట్కాలను, ప్రత్యామ్నాయ మార్గాలను పాటించాలని సూచిస్తున్నారు. ఉప్పు వాడకం తగ్గించడం వల్ల రక్త పోటు తగ్గుతుందని 2017లో Journal of the American College of Cardiology లో ప్రచురితమైన 'The effects of sodium reduction on blood pressure in individuals with hypertension అధ్యయనంలో తేలింది.
మనలో చాలా మందికి జామ పండు, పచ్చి మామిడి కాయ, మొక్కజొన్న వంటి వాటిపై ఉప్పు చల్లుకొని తినే అలవాటు ఉంటుంది. అయితే ఇలాగే తినాలని ఇష్టపడే వారు ఉప్పుకి బదులుగా నిమ్మ పొడి (నిమ్మతొక్కలను ఎండబెట్టి చేసే పొడి), ఆమ్చూర్ పొడి (మామిడి కాయల్ని ఎండబెట్టి చేసే పొడి), వాము, మిరియాల పొడి, ఒరెగానో వంటి వాటిని ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకోవచ్చని అంటున్నారు. ఫలితంగా ఉప్పు వాడకాన్ని తగ్గించుకోవచ్చని చెబుతున్నారు.
కొంత మంది కూరలు వండుకునేటప్పుడు ముందే కారంతో పాటు ఉప్పు కూడా వేసేస్తుంటారు. కానీ




అలా కాకుండా కూర పూర్తిగా ఉడికిన తర్వాత.. దానిపై నుంచి కాస్త ఉప్పు చల్లినా రుచికి సరిగ్గా సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు.
ముఖ్యంగా సాస్లు, నిల్వ పచ్చళ్లు మొదలైన వాటిలో ఉప్పు మోతాదుకు మించి ఉంటుంది. అయితే, ఇలాంటివి అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరమని అంటున్నారు. కాబట్టి ఇలాంటి పదార్థాలు తీసుకోవడం బాగా తగ్గించాలని సూచిస్తున్నారు.
ఇంకా పెరుగు, సలాడ్స్, పండ్లు వంటి వాటిలో కూడా ఉప్పు చల్లుకొని తినడం కంటే నేరుగా తినడమే మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఇలా చేస్తేనే వాటిలోని అసలు రుచి తెలుస్తుందని అంటున్నారు. ఇదే కాకుండా అలాగే ఉప్పునూ తగ్గించుకున్నట్లు అవుతుందని వివరిస్తున్నారు.
ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలో నీటి స్థాయులు పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా ముఖం, పొట్ట, ఇతర శరీర భాగాలు ఉబ్బినట్లుగా కనిపిస్తాయని హెచ్చరిస్తున్నారు. అందుకే ఉప్పు మోతాదును క్రమంగా తగ్గించుకోవాలని సూచిస్తున్నారు.
ముఖ్యంగా మనలో చాలామంది డైనింగ్ టేబుల్పై ఉప్పు డబ్బా ఉంచుతారు. అలాగే కొంతమంది తినేటప్పుడు తప్పకుండా ఉప్పు డబ్బాను తమ వెంటే ఉంచుకుంటారు. ఇలా చేయడం వల్ల కూడా ఎక్కువ ఉప్పు తీసుకునే అవకాశం ఉంటుందని నిపుణులు అంటున్నారు. కాబట్టి ఈ అలవాటును మానుకోవడం వల్ల ఉప్పు వినియోగాన్ని తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com
SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# సినిమా రివ్యూ




మలయాళ ఇండస్ట్రీలో ఎటువంటి అంచనాలు లేకుండా వచ్చి సూపర్ హిట్ ను అందుకున్న ప్రేమలో సినిమా హీరోయిన్ మమిత బైజు వం-సగా సినిమాలను చేసుకుంటూ బిజీగా ఉంది. అన్ని ఇండస్ట్రీలలో వరుసగా సినిమా ఆఫర్స్ ఆమె తలుపు తడుతున్నాయి. తాజాగా ఈఅమ్మడు మరో కొత్త సినిమాతో ప్రేక్షకులు ముందుకు వచ్చింది. పి.ఎన్.బి సినిమాస్ బ్యానర్ పై రూపొందిన యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ 'డియర్ కృష్ణ' చిత్రం ఈరోజు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అక్షయ్ హీరోగా, 'ప్రేమలు' మూవీ ఫేమ్ మమిత బైజు ప్రత్యేక పాత్రలో , ఐశ్వర్య హీరోయిన్ గా నటించిన ఈ చిత్రం సామాజిక మాధ్యమాల్లో మంచి క్రేజ్ ను సంపాదించుకుంది. యదార్ధ సంఘటన ఆధారంగా తెరకెక్కి, మంచి అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ఏ మేరకు ప్రేక్షకులను ఆకట్టుకుందో ఒకసారి రివ్యూ లో తెలుసుకుందాం..

**కథ:** హీరో అక్షయ్(అక్షయ్) కాలేజ్ చదివే కుర్రాడు. తండ్రి బాలకృష్ణ(అవినాష్) రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త. తండ్రి కొడుకుల్లా కాకుండా స్నేహితుల్లా వీరి బంధం ఉంటుంది. వీరిని అపురూపంగా చూసుకునే అక్షయ్ తల్లి(శాంతి కృష్ణ). కాలేజీ, ఫ్రెండ్స్, టీచర్స్ ఇలా సాగుతున్న అక్షయ జీవితంలోకి హీరోయిన్ రాధిక(ఐశ్వర్య) వస్తుంది. వీరి ప్రేమకు హీరో తండ్రి సలహాలు ఇస్తూ సపోర్ట్ చేస్తుంటాడు. కానీ రాధిక వాళ్ళ అమ్మానాన్నలకు ఇది నచ్చదు. ఈ క్రమంలో హీరోకు ఒక ఆరోగ్య సమస్య బయటపడుతుంది. మొదట్లో ఇది చిన్న సమస్య అనుకున్నప్పటికీ కొన్ని టెస్టులు రిపోర్టుల తర్వాత ఇది ప్రాణాంతకమైన సమస్యగా ఉందని డాక్టర్స్ చెప్తారు. ఆ సమస్య ఏంటి? ఆ సమస్య నుంచి అక్షయ్ ఎలా బయటపడ్డారు.? డాక్టర్ చేతులెత్తేసిన అక్షయ్ సమస్య ఎలా పరిష్కరించబడింది.? ఇక అక్షయ్ ప్రేమను దక్కించుకున్నాడా? లేదా.? రాధిక వాళ్ళ పేరెంట్స్ సమస్య ఏంటి? అనేది తెలియాలంటే డియర్ కృష్ణ సినిమా చూడాల్సిందే.

**విశ్లేషణ:** హీరో అక్షయ్ జీవితంలో 2015 లో జరిగిన యదార్ధ సంఘటనల ఆధారంగా ఈ మూవీని తెరకెక్కించారు. వైద్య చరిత్రలోనే ఇది ఒక అరుదైన కేసుగా.. ఇలాంటి సమస్యకు వైద్యులు మాత్రమే కాకుండా దైవ శక్తి కూడా తోడైంది. అదే పాయింట్ తో ఈ సినిమాను ప్రేక్షకులకు అందించారు. ఈ మూవీ మొదటి భాగం అక్షయ్ లైఫ్ స్టైల్, వాళ్ళ అమ్మానాన్న ల మధ్య ఉన్న రిలేషన్ షిప్, ఫ్రెండ్షిప్, కాలేజీ లైఫ్ స్టైల్, అక్షయ్ తోటి విద్యార్థులకు చేసే సహాయాలను పరిచయం చేశారు. అలాగే హీరోయిన్ ఐశ్వర్య, అక్షయ్ ల మధ్య లవ్ ట్రాక్ కూడా యూత్ కి కనెక్ట్ అయ్యేలా చూపించిన విధానం ఆకట్టుకుంది. అక్షయ్ స్నేహితురాలిగా చిన్న రోల్ లో ప్రేమలు బ్యూటీ మమిత బైజు ఆకట్టుకుంది. అక్షయ్కున్న ఆరోగ్య సమస్య బయటపడిన తర్వాత అసలైన సంఘర్షణ మొదలవుతుంది. హీరో హీరోయిన్ల మధ్య వచ్చే లవ్ ట్రాక్ యూత్ ను బాగా ఆకట్టుకున్నాయి. ఈ జంటకు ఉండే లవ్ సమస్యను కూడా చాలా ప్రాక్టికల్ గా చూపించారు.. సినిమాలో ఇదే కాస్త యూత్ ను బాగా ఆకట్టుకొనే అంశం అనే చెప్పాలి..

హీరో ఆరోగ్య సమస్యతో మంచి ఇంటర్వెల్ బ్యాంక్ ఉంటుంది. ఇక సెకండాఫ్ అంతా మెడికల్ బ్యాక్ డ్రాప్ లో ఎమోషనల్ పాయింట్స్ ను టచ్ చేసేలా స్టోరీని రాసుకొచ్చాడు డైరెక్టర్.. దాంతో సినిమాపై జనాల ఆసక్తి పెరిగిందనే చెప్పాలి. దైవభక్తి ఎలా పనిచేస్తుందో చూపించారు. సెకండాఫ్ చాలా వరకు ఆసుపత్రిలో జరిగే సంఘర్షణ ఉంటుంది కానీ ఎక్కడా బోర్ కొట్టకుండా లోతైన భావోద్వేగాలను పండించిన విధానం ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది. సినిమా చూస్తున్నంత సేపు హీరో అక్షయ్ కి ఏమవుతుందో అన్న ఒక టెన్షన్ ను డైరెక్టర్ చూపించిన విధానం బాగుంది. ప్రీ క్లైమాక్స్ లో డాక్టర్స్ కూడా చేతులు ఎత్తేసిన తరుణంలో ప్రేక్షకుడు గుండె దడ పెరుగుతుంది. సినిమా మొత్తం ఒక ఉత్కంఠ భరితంగా సాగే ఎన్నో సన్నివేశాలు, ప్రేక్షకుడిని సీటు అంచున కూర్చోబెట్టే సెన్స్ ను సెకండాఫ్ హ్యాండిల్ చేస్తున్న విధానంలో డైరెక్టర్ పనితనం తెరపై పండింది. సెకండాఫ్ సినిమాను భావోద్వేకంగా నిలబెట్టిందని చెప్పవచ్చు. మొత్తానికి సినిమాకు యూత్ బాగా కనెక్ట్ అవుతారని తెలుస్తుంది..

**నటీనటులు:** ఇందులో హీరో అక్షయ్ సిల్వర్ స్క్రీన్ కు కొత్త అయిన ఎంతో అనుభవం ఉన్న నటుడిలా అద్భుతమైన ప్రదర్శన చేశారు. ఈ సంఘటన ఆయన నిజ జీవితంలోనే జరిగింది కాబట్టి ఆ సంఘటనల తాలూకు సంఘర్షణను కనబరచడంలో అక్షయ్ విజయం సాధించారు. ఎక్స్ ప్రెషన్స్ కూడా చాలా సహజంగా పండించారు. ఇదే స్థాయిలో చెప్పుకోదగ్గ పాత్ర తండ్రిగా నటించినా అవినాష్ పాత్ర. ఫస్టాఫ్ అంతా కేవలం కొడుకుతో స్నేహంగా ఉండే భావోద్వేగాలను పండించి సెకండ్ హాఫ్ లో లోతైన భావోద్వేగాల సంఘర్షణను చూపిస్తూ ప్రేక్షకుడిని సైతం కంటతడి పెట్టేలా చేశారు. తల్లి పాత్రలో నటించిన శాంతి కృష్ణ అద్భుతమైన ఎమోషనల్ సీన్స్ అందించారు. మమత బైజు మంచి నటనను కనబరిచారు. హీరోయిన్ గా ఐశ్వర్య అభినయం అందం నటన సినిమాకు ప్లస్ పాయింట్ అని చెప్పవచ్చు. మిగతా నటీనటులంతా తమకున్న పాత్రలో అద్భుతమైన నటనను కనబరిచారు.. సినిమాలో అందరు ఎవరికి వారు న్యాయం చేశారు.

**సాంకేతిక నిపుణులు:** కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్, డైరెక్టర్ దినేష్ బాబు యదార్ధ సంఘటనను సినిమాటిక్ లిబర్టీ తీసుకోకుండా ప్రేక్షకుల హృదయాలను తాకే సీన్స్ ను డైరెక్ట్ చేసిన విధానం మెప్పించింది. సెకండ్ హాఫ్ లో వచ్చే భావోద్వేగాలను అద్భుతంగా పట్టుకున్నారు. చాలా సీన్లు హృదయానికి హత్తుకునేలా డిజైన్ చేసిన విధానం మెప్పించింది. కామెడీ లవ్ ఎమోషనల్ అండ్ మిరాకిల్ సీన్స్ ను అద్భుతంగా తెరకెక్కించారు. దర్శకుడు దినేష్ బాబుకు కచ్చితంగా మంచి భవిష్యత్ ఉంటుందని ఆయన టేకింగ్ చూస్తే అర్థమవుతుంది. హరి ప్రసాద్ అందించిన సంగీతం నేపథ్య సంగీతం ఆకట్టుకుంది. పాటలు బాగున్నాయి. అలాగే ఎమోషనల్ సీన్స్ లో వచ్చే బిజిఎం కట్టి పడేసింది. ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ చాలా బాగుంది. నిర్మాణ విలువలు అద్భుతంగా ఉన్నాయి. ఎక్కడ కాంప్రమైజ్ అవ్వకుండా నిర్మాత పిఎన్ బాలు ఖర్చుకు వెనకాడకుండా ఈ సినిమాను అందించిన విధానం ప్రేక్షకులను మెప్పించింది.

**ప్లస్ పాయింట్స్:** కథ, కథనం డైరెక్షన్ నటీనటులు సంగీతం

**మైనస్ పాయింట్స్:** సెకండ్ హాఫ్ లో కొంతైనా కామెడీ ఉంటే బాగుండేది.. కొన్ని సీన్స్ ల్యాగ్ అనిపించాయి..

---




పాన్ ఇండియా డైరెక్టర్ సుకుమార్ కూతురు సుకృతి వేణి నటిగా ఎంట్రీ ఇస్తూ చేసిన సినిమా 'గాంధీ తాత చెట్టు'. ఈ సినిమాకి ప్రమోషన్ ఎక్కువగా జరగడానికి కారణం ఆమెనే. మరి సినిమాలో ఆమె ఎలాంటి నటన కనపరిచింది. అనేది ఈ రివ్యూ ద్వారా తెలుసుకుందాం రండి :

**కథ :** రామచంద్రయ్య (ఆనంద చక్రపాణి) నిజామాబాద్ జిల్లా ఆలూరు గ్రామానికి చెందిన వ్యక్తి. ఇతను గాంధేయవాది.తన తండ్రి స్ఫూర్తితో దేశభక్తి ఎక్కువగా పెంచుకుంటాడు. తనలానే తన కొడుకు కూతురు మనవరాలుకి కూడా గాంధీ (సుకృతి వేణి) అని నామకరణం చేస్తాడు. రామచంద్రయ్య మాదిరే గాంధీ కూడా సత్య మార్గంలో నడుస్తూ దేశభక్తి పెంచుకుంటుంది. ఇదిలా ఉంటే.. రామచంద్రయ్యకు 15 ఎకరాల భూమి ఉంటుంది. అక్కడే ఒక వేప చెట్టు కూడా ఉంటుంది. అదంటే అతనికి చాలా ఇష్టం. మరోపక్క రాజకీయ నాయకులూ చేసిన కుట్ర వల్ల ఆ ఊర్లో ఉన్న చెరకు ఫ్యాక్టరీ మూత పడుతుంది. దీంతో చెరుకు పండించిన రైతులు నష్టాలు పాలవుతారు. మరోపక్క కెమికల్ ఫ్యాక్టరీ పెట్టి ఉపాధి ఇస్తానని వ్యాపారవేత్త సతీష్(రాగ్ మయూర్) రైతులను నమ్మించి మోసం చేయాలని చూస్తుంటాడు. దీంతో అంతా తమ పొలాలు అమ్మేయడానికి సిద్ధమవుతారు. కానీ రామచంద్రయ్య మాత్రం తన భూమిని అమ్మేందుకు ఒప్పుకోడు. పొలం పోయినా వేప చెట్టుని ఎక్కడ కొట్టేస్తారో అనేది అతను భయం.అందుకోసం తన కొడుకుతో గొడవపడతాడు. ఈ క్రమంలో గాంధీ తన తాతకి అండగా నిలబడుతుంది. ఆ తర్వాత ఏం జరిగింది అనేది మిగిలిన కథ.

**విశ్లేషణ :** ఈ సినిమా ప్రమోషన్స్ లో నిర్మాత 'మైత్రి' రవిశంకర్ ఒక మాట అన్నాడు. 'పుష్ప 2' లో హీరో నెగిటివ్ రోల్, స్మగ్లర్ అన్నారు కదా..? 'గాంధీ తాత చెట్టు' అనేది మంచి సినిమా' ఈ సినిమాని ఆదరించండి మరి' అని అన్నాడు. అతని మాట ముమ్మాటికీ కరెక్ట్. ఇది సామాజిక స్పృహ ఉన్న సినిమా. దేశభక్తి, మొక్కల్ని పెంచడం, చెట్టుని కాపాడుకోవడానికి ఓ పాప ఎదురుతిరగడం.. ఇలాంటి మంచి విషయాలు అందరికీ కనెక్ట్ అవుతాయి అని చెప్పలేం. కానీ దర్శకురాలు పద్మావతి మల్లాది.. రాసుకున్న ఎమోషనల్ సీన్స్ బాగున్నాయి. 'వృక్షో రక్షతి రక్షితః' అనే మాటని ఆణువణువూ గుర్తు చేస్తూ కథని నడిపించింది. సినిమాటోగ్రఫీ బాగుంది. సంగీతం బాగా కుదిరింది. సినిమా ఫస్ట్ హాఫ్.. పెద్దగా ల్యాగ్ లేకుండా మెయిన్ పాయింట్ కి తీసుకువెళ్లిన విధానం బాగుంది. ఇంటర్వెల్ సీక్వెన్స్ కూడా బాగా కుదిరింది. సెకండాఫ్ లో కూడా తాను చెప్పాలనుకున్న పాయింట్ ను దర్శకురాలు చెప్పగలిగింది. కొన్ని డైలాగ్స్ కూడా బాగా పేలాయి. అయితే ముందుగా చెప్పుకున్నట్టు ఇది.. ఎంటర్టైన్ చేసే సినిమా కాదు. ఆలోచింప చేసే సినిమా.

**నటీనటుల విషయానికి వస్తే..** ముందుగా కథ మొత్తం రామచంద్రయ్య అనే పాత్ర చుట్టూనే తిరుగుతుంది. ఆ పాత్ర చేసిన ఆనంద్ చక్రపాణికి ఎక్కువ మార్కులు పడతాయి. అతనితో సమానంగానే సుకృతి వేణికి కూడా మంచి మార్కులు పడతాయి. ఇంత చిన్న వయసులో ఆమె అంత చక్కగా నటిస్తుంది అని ఎవ్వరూ ఊహించలేరు. ఒకవేళ ఊహించినా అంతకంటే గొప్పగానే నటించింది ఆ పాప. 'కీడా కోలా' ఫేమ్ రాగ్ మయూర్ కి కూడా మంచి పాత్ర దొరికింది. తన సహజమైన నటనతో అతను కూడా మంచి మార్కులు వేయించుకుంటాడు. రఘురామ్, భాను ప్రకాష్ కూడా బాగా నటించారు.

**ప్లస్ పాయింట్స్ :** కథ డైరెక్షన్ సుకృతి వేణి నటన సినిమా రన్ టైం 2 గంటల లోపే ఉండటం

**మైనస్ పాయింట్స్ :** అక్కడక్కడా స్లోగా అనిపించడం

**ఫైనల్ గా** 'గాంధీ తాత చెట్టు' మంచి సినిమా. బోలెడన్ని ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ పొందింది. కచ్చితంగా ఇండస్ట్రీ నుండి కూడా మంచి అప్రిషియేషన్ వచ్చే అవకాశం ఉంది. కానీ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్లు కురిపిస్తుందా? అంటే కచ్చితంగా చెప్పలేం.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)


నిర్వహణ :

స్వర్ణకంకణ సన్మానిత, జ్యోతిష్య చూడామణి, జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద

డా॥ఈడ్పుగంటి పద్మజారాణి



91 9849250852,

91 7506976164

padma.suryapaper@gmail.com


# 26.1.2025 నుంచి 1.2.2025 వరకు



## మేష రాశి

*అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము*

వారం ప్రారంభంలోసామాజిక సేవ చేస్తారు,తగిన గుర్తింపు ఆశించిన స్థాయిలో లభ్యం అవటం లేదని ఒక రకమైన అసం తృప్తి ఉన్నప్పటికీ మీ పుణ్య బలముతో దాన్ని జయించే ప్రయత్నాలు చేస్తారు. తండ్రి పెద్దలు గురువుల ఆశీస్సుల లభ్య మవుతాయి.జీవిత భాగస్వామి యొక్క ఆర్థిక విషయాలు అనుకూలంగా ఉంటాయి ఉన్నతవిద్య కొరకు ప్రయత్నం చేసే వారికి అనుకూలంగా ఉంటుంది దూర ప్రయాణాలకు అవకాశం ఉంటుంది ఆధ్యాత్మిక ప్రదేశాలు సందర్శించడానికి ప్రయత్నాలు చాలా వరకు అనుకూలంగా ఉంటాయి. వారం మధ్యలో వృత్తికి సంబంధించి నిర్ణయాలు మార్పు చెందు తాయి, ముఖ్యంగా జీవిత భాగస్వామికి వృత్తిపరమైన అభివృద్ధి ఏర్పడుతుంది. రుణములు చెల్లించుటకు మీరు చేసే ప్రయత్నాలు చాలా వరకు అనుకూలంగా ఉంటాయి.



## వృషభరాశి

*కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు*

వారం ప్రారంభంలోనూతన ప్రదేశాలలో ఆహార స్వీకరణ, ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. రహస్య శత్రువుల వల్ల ఇబ్బంది అధికంగా ఉంటుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి , ముఖ్యమైన విషయాలు వాయిదా పడతాయి ప్రయాణాల విషయం జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు వెళ్లాలి. వస్తువులని అజాగ్రత్తగా వదిలేయకూడదు ప్రయాణాలలో నూతన వ్యక్తులని నమ్ము తూ ముందుకు వెళ్లేటప్పుడు ఆచితూచి వ్యవహరించాలి. తండ్రి యొక్క బంధువులు మీ ఇంటికి రాక,చేసే కార్యక్ర మాల్లో అసంతృప్తి, ఆధ్యాత్మిక అంశాల్లో ఆటంకాలు, దూర ప్రయాణాలు, విద్యార్థులు పోటీలలో శ్రమతో విజయాలు, విదేశీ విద్యకై ఆలోచనలు, ఆకస్మిక ధన రాబడి, భాగస్వా మ్యం వ్యవహారాల్లో నూతన ఆలోచనలు.



## మిథున రాశి

*మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు*

వారం ప్రారంభంలో జీవిత భాగస్వామి అభిప్రాయ బేధాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మీ విషయంలో శ్రద్ధతో నిర్ణయాలు, భాగస్వామ్య విషయాల్లో అశ్రద్ధ ఉండడం వల్ల అపార్థాలకు అవకాశం ఉంది. దూర ప్రయాణాలకు అవకా శం. జాయింట్ వెంచర్స్ గురించి దృష్టి సారిస్తారు. ఆధ్యాత్మి కుల దీవెనలు అందుకుంటారు. వారం మధ్యలో సంతానం యొక్క ఆరోగ్యమే శ్రద్ధ తీసుకుంటారు. మీ ఆలోచనలు మీకే వ్యతిరేకంగా ఉండడం వల్ల కొన్ని ఇబ్బం దులు ఎదుర్కొం టారు. ఉపాసన విషయంలో ఆటంకాలు. కుటుంబంలోని ఇష్టమైన వ్యక్తుల కొరకు ఖర్చులు అధికంగా ఉంటాయి. జీవితభాగస్వామి వృత్తిపరమైన అభివృద్ధి. కమ్యూ నికేషన్ బాగుంటుంది.



## కర్కాటక రాశి

*పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు*

ప్రారంభము శత్రువులు ఇబ్బంది చికాకులు ,రోగనిరోధక శక్తి పెంపోందించుకోవాలి. ఋణముల విషయంలో అప్ర మత్తం. అనవసరస్నేహాలకై వృధా ఖర్చులు, అలవాట్లు వలన ఇబ్బందులు. ఆరోగ్య రీత్యా తగిన జాగర్తలవసరం. ఉద్వే గం కోపం నియంత్రించుకోవాలి. .సామజికసేవ చేస్తారు. ఆధ్యాత్మిక వ్యక్తుల కలయిక, పుణ్యనదీ స్నానములు,మీ సం బంధ న్యాయ విషయములకై మంతనములు. ఖర్చులు నియాంత్రించుకోవాలి. అప్పులు చేసితీర్చే ప్రయత్నాలు. వారము మధ్యలో జీవిత భాగస్వామి ద్వారా ఆర్థిక సహకా రము. కుటుంబములో కొంత ఆహ్లాద వాతావరణము. విద్యా ర్థులు శ్రమ అధికము.తల్లి తండ్రుల సలహా తోడ్పాటు. వార ము చివరిలోమానసిక ఆరోగ్యము శ్రద్ధ.ఆహారము కొత్త ప్రదేశాల్లో తీసుకునేటపుడు జాగర్త అవసరము.



## సింహ రాశి

*మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము*

ప్రారంభముల్లో డివియేషన్సు స్నేహ సంబంధాలు వల్ల విద్యా సంబంధ ఇబ్బంది అధికంగా ఉంటాయి.విద్యార్థులకు విద్యా సంబంధ అంశాల్లో రాత నైపుణ్యాలు తగిన విధంగా ఆసక్తి పెంచుకోవాలి.ఉపసనాబలం పైన శ్రద్ధ తీసుకుంటూ నైరశ్యా న్ని దూరం చేసుకుని ముందుకు సాగాలి. ఆలోచనలో ఆల స్యాలు ఉన్నప్పటికీ ముఖ్యమైన శ్రేయోభిలాషుల యొక్క సల హా సహకారంతో సమస్యల అధికమిస్తారు. మానసిక ఒత్తిడి సమస్యలు అధికంగా ఉన్నప్పటికీ యోగ మెడిటేషన్ మొద లైంది చేయడం వల్ల మంచిది. వారం మధ్యలో గవర్నమె ంట్ నుంచి రావలసిన ధనాన్ని ఆకస్మికంగా అందుకుంటారు. కుటుంబంలో వ్యక్తులకి వృత్తి కొరకు అవకాశాలు లభిస్తాయి. వారం చివరిలో మిత్రులతో కలిసి ప్రయాణాలు.



## కన్యా రాశి

*ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు*

ఈ రాశి వారికి ప్రారంభంలోగృహవాతావరణం, ముఖ్యంగా గృహంలో చిన్నపాటి రిపేర్లు వాహనానికి సంబంధించిన అంశాలు కొంత చికాకులు కలిగిస్తుంది. అయినప్పటికీ వాటిని మీ యొక్క తెలివితేటలతో అధిగమిస్తూ ముందుకు వెళతారు.విద్యాపరమైన నూతన విషయాలు తెలుసుకుంటారు తల్లి యొక్క ఆరోగ్యం మీద ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటారు విద్యార్థులకు విద్యాపరమైన విషయాలు మీద తగిన శ్రద్ధ తీసుకోవాలి.ముఖ్యంగా పరీక్షలు రాసేటప్పుడు శ్రీహయగ్రీ వాయనమః మంత్రాన్ని పట్టించడం చాలా మంచిది. వారం మధ్యలో నూతన సృజనాత్మకమైన నిర్ణయాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్వేగాలని నియంత్రించుకుంటూ ముందుకు వెళ్లవలసిన అవసరం ఉంది. సంతానం యొక్క అభివృద్ధి విషయంలో కొత్త విషయాలు వింటారు.



## తులారాశి

*చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు*

వారం ప్రారంభంలో ఆత్మీయ వ్యక్తుల సహకారంతో చెప్పవ లసిన మాటలను చక్కగా చెబుతూ ఫలితాలు సాధించాలి. ప్రయాణం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మధ్యవర్తిత్వాలు అగ్రిమెంట్లు పనికిరాదు.వ్యక్తుల సహకారం తీసుకోవడానికి మనసు నిరాకరిస్తుంది. కమ్యూనికేషన్ విషయంలో కొంత ఇబ్బందులు అధికంగా ఉంటాయి మాట్లాడవలసిన సమ యంలో మాట్లాడకపోవడం వల్ల కూడా కొన్ని అవకాశాలు కోల్పోయే రీత్యా మీరెంత జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు వెళ్లాలి.వారం మధ్యలో గృహ వాతావరణం వాహనాన్ని సంబం ధించిన విషయాలు, సౌకర్యాలు, నూతన గృహ నిర్మాణ విషయంలో ఆగిన పనులు కొంత చర్చకు రావడం జరుగుతుంది. ఆర్థికంగా కొంత చికాకులు ఉన్నప్పటికీ అధిగమిస్తారు.



## వృశ్చిక రాశి

*విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు*

వారం ప్రారంభంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కొంత కష్టంగా ఉంటుంది కుటుంబ వ్యవహారాలలో ఇతరుల జోక్యం కొంత విసుగును కలిగిస్తుంది.ఆర్థికంగా ఖర్చులు అధికంగా ఉంటాయి రావలసినదని రావడంలో కొంత ఆలస్యాలు ఉంటాయి. నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి. వారం మధ్యలో వృత్తికి సంబంధించిన విషయాలలో అవలీలగా ముందుకు వెళతారు. ఆగుతూ వస్తున్న పనులు ముందుకు పెడతాయి. సంకల్ప బలం పెరుగుతుంది కమ్యూనికేషన్ బాగుంటుంది వ్యక్తులు సహకరిస్తారు మిత్రులతో కలిసి చర్చలు చేసి నూతన ఆలోచనలకు శ్రీకారం చుడతారు. దగ్గర ప్రయాణాలు చేస్తారు. మిత్రుల కొరకు ఖర్చులు అధికం చేస్తారు. మీ ఇంటికి బంధువులు రాక. తల్లితండ్రుల సహకారంతో గృహ ప్రయత్నాలు, భూమి కొనుగోలు కొరకు ఆలోచిస్తారు.



## ధనస్సు రాశి

*మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము*

వారం ప్రారంభంలో ప్రవచనాలు మొదలైన వాటి మీద ఆసక్తి అధికంగా ఉంటుంది . మానసిక ప్రశాంతత తక్కువగా ఉ ండటం వల్ల అందరికీ దూరంగా ఉంటారు. అయినప్పటికీ అవన్నీ మీ మనోబలంతో జయించే ప్రయత్నాలు చేయాలి. ఆధ్యాత్మిక ధోరణి, నైరాస్యమైన ఆలోచనలు, మీ మీద మీకు శ్రద్ధ తక్కువగా ఉంటుంది. ముఖ్యంగా తల్లి జీవిత భాగస్వా మి తో కలిసి ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించాలని కోరిక బలంగా ఉంటుంది. వారం మధ్యలో ఆర్థిక విషయాలు అనుకూలంగాఉంటాయి కుటుంబ వాతావరణం అనుకూలం గా ఉంటుంది. వాయిదా పడుతూ వస్తున్న ఎదురుచూస్తున్న ధనాన్నికొంతైనాఅందుకుంటారు.విద్యార్థులకు విద్యాపరమైన వస్తువులు కొనుగోలు కొరకు ఖర్చుల అధికంగా ఉంటాయి. జ్ఞాపకశక్తిని పెంచుకునే విధంగా కృషి చేయాలి.



## మకర రాశి

*ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు*

ప్రారంభంలోఆధ్యాత్మిక వ్యక్తుల్ని కలుసుకుంటారు వారి ఆశీస్సులు తీసుకుంటారు ట్రస్టులు మొదలైన వాటికి విరా ళాలు ఇస్తారు. శారీరక శ్రమ అధికంగా ఉంటుంది తగిన విశ్రాంతి తీసుకోవాల్సిన అవసరం ఉంది.ఆరోగ్యం మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు ముఖ్యంగా కంటికి సంబంధిం చిన విషయాలలో జాగ్రత్తలు అవసరము వృత్తిపరంగా అధిక బాధ్యతలు ఆలోచనలు మొదలైన వాటి వల్ల శ్రమ, సమయానికి ఆహార స్వీకరణ తీసుకోకపోవడం వల్ల కొంత అనరోగ్య భావనలు. వారం మధ్యలో వ్యక్తిగత ఆలోచనలు బాగుంటాయి శారీరక శ్రద్ధ పెరుగుతుంది నిర్ణయాలు తీసుకుంటారు మీ యొక్క వృత్తిలో నూతన అభివృద్ధి కొరకు విశేషంగా శ్రమ పడతారు. జీవిత భాగస్వామితో కలిపి కొత్త నిర్ణయాలు తీసుకుంటారు.



## కుంభ రాశి

*ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు*

ప్రారంభంలోవచ్చిన లాభాలను సద్వినియోపరుచుకునే విషయంలో కూడా అనాసక్తి వైరాగ్య భావనలు. కుటుంబానికి సంబంధించిన ఆర్థిక లాభాలు, ఒక సమాచారం ఆలోచనలు కలిగిస్తుంది.మీ సేవలకు తగిన గుర్తింపు గౌరవం లభిస్తుంది దూర ప్రదేశాల్లో ఉండే మిత్రులతో సంభాషణ. వారసత్వ పాస్తుల విషయంలో కుటుంబ వ్యక్తులతో అభిప్రాయ బేధాలు రాకుండా జాగ్రత్త పడాలి. వారం మధ్యలో కుటుంబపరమైన ముఖ్య కార్యక్రమాలు, దైవ సందర్శన, ఖర్చులు అధికంగా ఉంటాయి. నిద్రలేమి ఆహార లోపం చికాకును కలిగిస్తాయి. ఇప్పటిదాకా మందకొడికే సాగిన ఆర్థిక విషయాలు ఓ కొలిక్కి వస్తాయి. వారం చివరిలోనూతన విషయాలు వింటారు. నిర్ణ యాలు తీసుకుంటారు. అయినప్పటికీ ఆత్మవిశ్వాసం చాలా తక్కువగా ఉంటుంది. సంకల్పబలం పెరుగుతుంది.



## మీనరాశి

*పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు*

వారం ప్రారంభంలోఖర్చులు శక్తికి మించి ఉండడం వల్ల చికాకులు పెరుగుతాయి. మీ తెలివితేటలతో వాటిని అధి గమిం చగలుగుతారు. రహస్య శత్రువుల వల్ల నైపుణ్యాలు పెరుగుతాయి కృషి పెరుగుతుంది. వృత్తికి సంబంధించిన విషయాలు మీద ఆసక్తి తక్కువగా ఉంటుంది. అనవసర వ్యక్తుల జోక్యం వల్ల వృత్తిలో చికాకులు అధికం. చేస్తున్న వృత్తి మారే ఆలోచనలు అధికం చేస్తారు. అలాంటి ఆలో చనలు నియంత్రించుకుంటూ యోగా మెడిటేషన్ మొదలై నవి చేయడం మంచిది. విద్యార్థులు విద్యకి సంబంధించిన విషయాలలో చాలా గట్టిగా కృషి చేస్తారు. వారం మధ్యలో ఆర్థిక సంబంధమైన విషయాలు కొంతవరకు అనుకూలంగా ఉంటాయి. భాగస్వామికి వృత్తిపరమైన విషయాలలో ఉన్నత స్థాయి వ్యక్తులు రాజకీయ నాయకుల సహకారం

# ఐశ్వర్య రాజేష్

